ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
శుక్రవారం 5 డిసెంబరు 2025



ఎయిర్‌పోర్ట్ స్థలాన్ని పరిశీలించిన అధికారులు 7

విద్యార్థుల శాస్త్రీయ ఆలోచనలు భేష్
- ముగిసిన జిల్లాస్థాయి సైన్స్‌ఫెయిర్ 8

మహనీయుల జీవితం ఆదర్శంగా తీసుకోవాలి



రోశయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

పెద్దపల్లి కల్చరల్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): మహనీయుల జీవితాలు మనందరికి ఆదర్శంగా మలుచుకోవాలని కలెక్టర్ కోయశ్రీహర్ష అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో మాజీ మంత్రి కొణిజేటి రోశయ్య వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ వనజతోపాటు జిల్లా అధికారులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి రాష్ట్రంలో రోశయ్య 16 సార్లు ఆర్థిక శాఖ మంత్రిగా పని చేశారని, అలాగే పలు శాఖల్లో వివిధ హోదాల్లో మంత్రిగా పని చేసి, దేశ చరిత్రలోనే ఒక చరగని ముద్ర వేశారన్నారు. సీఎంగా, తమిళనాడు గవర్నర్‌గా పని చేశారని, మచ్చలేని వ్యక్తుల్లో ఆయన ఒకరని కీర్తించారు. జిల్లా యువజన క్రీడాధికారి సురేష్ పాల్గొన్నారు.

సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తికి మద్దతు ధర



కొనుగోలు చేసిన పత్రాన్ని రైతుకు అందిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పత్తి సాగు చేసిన రైతులు సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. గురువారం నిమ్మనపల్లి మహాలక్ష్మి జిన్నింగ్ మిల్లులో సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం రైతు కలవెన మల్లేశంకు చెందిన 27 క్వింటాళ్ల 80 కిలోల పత్తిని కొనుగోలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నాణ్యమైన ఏ గ్రేడ్ పత్తికి క్వింటాలుకు రూ. 8100 మద్దతు ధర ప్రభుత్వం చెల్లిస్తున్నట్లు తెలిపారు. 8 నుండి 12 శాతం లోపు తేమ ఉండేలా పత్తిని సిసిఐ కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని రైతులను కోరారు. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలించక పంటల దిగుబడి తగ్గిందన్నారు. రైతులు పంటల మార్పిడిపై దృష్టి సారించాలని సూచించారు. వరి పొలాలు కోసిన తరవాత కోయకాలుకు రైతులు నిప్పు పెట్టడం వల్ల భూసారం తగ్గుతుందని, పంటకు ఉపయోగపడే సారవంతమైన కీటకాలు నశించి పంటల దిగుబడి తగ్గుతుందని రైతులు పంట అవశేషాలను భూమిలో కలియదున్నాలని తెలిపారు. పత్తి చివరి దశలో ఉన్నదని, దాని స్థానంలో యాసంగి సాగుగా మొక్కజొన్న సాగుతో అధిక లాభాలు పొందవచ్చన్నారు. హైబ్రిడ్ సీడ్ మొక్క జొన్న సాగుతో ఎక్కువ దిగుబడి సాధించి లాభాలు పొందవచ్చని, ఆ దిశగా రైతులు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. సేంద్రియ ఎరువుల వాడకం వల్ల పంటల సాగుకు కలిగే ప్రయోజనాలను వివరించారు. జిన్నింగ్ మిల్ యజమానులు నర్సింగరావు, మంగారావు, సిసిఐ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రామగుండాన్ని సింగరేణి సిటీగా నవ నిర్మాణం చేస్తాం



ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ దంపతులను సన్మానిస్తున్న నాయకులు

గోదావరిఖని, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రామగుండాన్ని సింగరేణి సిటీగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. రెండేళ్ల పాలన, రామగుండంకు 800మెగావాట్ల విద్యుత్ కేంద్రం మంజూరు సందర్భంగా గురువారం రాత్రి మెయిన్ చౌరస్తాలో బహిరంగ సభ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ రామగుండంలో థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మించాలని పాదయాత్ర చేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్ కేంద్రం మంజూరు చేస్తే వ్యతిరేకిస్తుందన్నారు. విద్యుత్ కేంద్రాన్ని వ్యతిరేకించే బీఆర్ఎస్ శక్తులు దమ్ముంటే బయటకు రావాలని, ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. రూ.450కోట్లతో పాలకుర్తి లిఫ్ట్ నిర్మాణానికి సంబంధించిన డీపీఆర్‌కు నిధులు మంజూరయ్యాయని, జీఓ విడుదలైందన్నారు. మాట్లాడితే బూడిద, ఇసుక అంటూ నాపై దుష్ప్రచారం చేస్తున్నారని, నన్ను, నా కుటుంబాన్ని టార్గెట్‌గా చేసుకుని, సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. బస్టాండ్, రాజేష్ థియేటర్ వద్ద షాపింగ్ కాంప్లెక్స్ అభివృద్ధి చేసి చిరు వ్యాపారులకు ఇస్తున్నామని, త్వరలోనే మల్టీప్లెక్స్‌ల నిర్మాణం జరుపనున్నామన్నారు. త్వరలో హౌసింగ్ బోర్డు వద్ద పట్టాలు ఇవ్వనున్నామని, ట్రాన్స్‌జెండర్లకు గృహ నిర్మాణాలు చేస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌ను సన్మానించారు. మనాలీఠాకూర్, మాజీ మేయర్లు బంగి అనీల్ కుమార్, రాజమణి, నగర అధ్యక్షుడు బొంతల రాజేష్, లింగస్వామి, పాల్గొన్నారు.

జిల్లాలో వేగంగా ధాన్యం కొనుగోళ్లు



- గత ఏడాది సీజన్ కంటే 47,162 టన్నులు అధికం
- ఇప్పటి వరకు 2,43,242 టన్నుల ధాన్యం కొనుగోలు
- వచ్చిన ధాన్యంలో సన్నాలే 87.39 శాతం
- రైతులకు 88 శాతం డబ్బుల చెల్లింపు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు వేగంగా జరుగుతున్నాయి. గతేడాది వానాకాలం సీజన్ కంటే ఈ ఏడాది అధికంగా ధాన్యం కొనుగోళ్లు చేశారు. వరి కోతల సమయంలో మొంథా తుఫాన్ ప్రభావం జిల్లాపై కూడా పడింది. జిల్లాలో కురిసిన వర్షాల వల్ల చాలా గ్రామాల్లో వరి పంట నేల వాలి రైతులకు నష్టం వాటిల్లింది. ఆ తర్వాత కూడా తుఫాన్ ప్రభావం ఉన్నప్పటికీ, వర్షాలు పడలేదు. కోసిన ధాన్యం ఆరబెట్టడానికి రైతులు ఇబ్బందులు పడ్డారు. నిర్ణీత తేమ 17 శాతం వచ్చే వరకు రైతులు ధాన్యాన్ని ఆర బోశారు. తేమ శాతం వచ్చినవి వచ్చినట్లే కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ధాన్యాన్ని కొనుగోలు చేసి కేటాయించిన రైస్‌మిల్లులకు తరలించారు. నాలుగు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నా రు. ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసిన 48 గంట ల్లోనే డబ్బులు జమ అవుతున్నాయని రైతులు తెలిపారు.

జిల్లాలో వానాకాలం సీజన్‌లో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని జిల్లా అధికార యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకున్నది. ఆ మేరకు గత నెలలో ధాన్యం కొనుగోళ్లను చేపట్టారు. ఇందు కోసం జిల్లా వ్యాప్తంగా 333 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో ఐకేపీ ద్వారా 65, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా 265 కేంద్రాలు, హాకా ద్వారా 3 కేంద్రాలను ఏర్పాటు చేశారు. వానాకాలం సీజన్‌లో జిల్లాలో 2 లక్షల 10 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఇందులో అత్యధికంగా 85 శాతానికి పైగా సన్న రకాలు సాగు చేయడం గమనార్హం.

గురువారం నాటికి జిల్లా వ్యాప్తంగా 581 కోట్ల రూపాయల విలువైన 2,43,242 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా, సన్న రకం 2,12,559.37 మెట్రిక్ టన్నులు, దొడ్డు రకం 30,682.98 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. గత ఏడాది ఇదే రోజుకు 1,96,080 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఈ యేడు గత ఏడాది కంటే ఇప్పటి వరకు అదనంగా 47,162 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం గమనార్హం. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పెద్దపల్లి, రామగుండం మిగతా 8వ పేజీలో..

చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం
ముప్పిడి శ్రీకాంత్, డీఎం సివిల్ సప్లయి

ఎలాంటి కోతలు, తరుగు లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. రైతులకు నష్టం వాటిల్లకుండా నిర్ణీత తేమ శాతం రాగానే ధాన్యం కాంటా పెట్టి తక్ పట్టీలు అందజేశాం. ఎప్పటికప్పుడు ధాన్యాన్ని కేంద్రాల నుంచి మిల్లులకు తరలించాం. ధాన్యం వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కాగానే 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతున్నాయి. జిల్లాలో రైతులు సన్న రకాలు ఎక్కువగా సాగు చేశారు. గత ఏడాది కంటే ఈ ఏడాది డిసెంబర్ నెలాఖరు లోపే కొనుగోళ్లు పూర్తి కానున్నాయి. చివరి గింజ వరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం.

తొలి విడతలో 2, 256 మంది పోటీ

- 4 సర్పంచ్, 211 వార్డు స్థానాలు ఏకగ్రీవం

పెద్దపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొదటి విడతలో జరుగుతున్న గ్రామ పంచాయతీల్లో ఎన్నికల్లో సర్పంచ్, వార్డు సభ్యుడి పదవులకు 2256 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. నాలుగు గ్రామాల్లో నలుగురు సర్పంచులు, 211 వార్డులకు వార్డుసభ్యులు ఏకగ్రీవమయ్యారు. మొదటి విడతలో మంథని, ముత్తారం, కమాన్‌పూర్, రామగిరి, కాల్వ శ్రీరాంపూర్ మండలాల్లోని 99 గ్రామ పంచాయతీల్లోని సర్పంచ్, 896 వార్డు స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. సర్పంచ్ కోసం 471 మంది, వార్డు స్థానాల కోసం 2565 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. బుధవారం నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసే సమయానికి మంథని మండలం నాగారం, ఖైదుపల్లి, తోటగోపయ్యపల్లి, రామగిరి మండలం చందనాపూర్ గ్రామ పంచాయతీల సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. తోటగోపయ్యపల్లి సర్పంచ్‌తో పాటు ఆరు వార్డుస్థానాలు ఏకగ్రీవమయ్యాయి. ముత్తారం మండలంలో 17 వార్డులు, కాల్వశ్రీరాంపూర్ 79 వార్డులు, మంథని మండలంలో 81 వార్డులు, కమాన్‌పూర్‌లో 11 వార్డులు, రామగిరి మండలంలో 23 వార్డులు ఏకగ్రీవమయ్యాయని డీపీఓ వీర బుచ్చయ్య తెలిపారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



ఆస్పత్రి ఆవరణ పరిశీలిస్తున్న కలెక్టర్

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎంసీహెచ్ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు. గురువారం మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. గైనకాలజిస్ట్ ఔట్ పేషెంట్ వద్ద సీటింగ్ సామర్థ్యం పెంచాలని, గర్భిణీలు నిలబడాల్సిన అవసరం రాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఫార్మసీ స్టోర్‌లో అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఎంసీహెచ్‌లో గర్భిణీలకు, పిల్లలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఏవైనా పరికరాలు అవసరమైతే ప్రతిపాదనలు అందించాలన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, ఆర్ఎంఓ డాక్టర్ విజయ్, అధికారులు పాల్గొన్నారు.

కీటక జనిత వ్యాధులను నియంత్రించాలి : డీఎంహెచ్‌వో

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కీటక జనిత వ్యాధులను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో వాణిశ్రీ సూచించారు. గురువారం వైద్యాధికారులు సూపర్‌వైజర్లు, ల్యాబ్ టెక్నీషియన్‌లతో సమీక్ష నిర్వహించారు. సాధారణ ప్రసవాలను ప్రోత్సహించే దిశగా యోగా, ఇతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు ప్రజలకు పూర్తిస్థాయిలో ఉపయోగపడేలా పర్యవేక్షణను బలోపేతం చేయాలన్నారు. పిల్లలకు టీకాలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. క్షయ లక్షణాలు ఉన్న అనుమానితులకు తేమడ పరీక్ష చేయించడంతో పాటు, క్షయ రోగులు,రక్తపోటు, మధుమేహం వారికి మందులు అందేలా చూడాలని సూచించారు. ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఆర్. రాజమౌళి, డాక్టర్ బి. శ్రీరాములు, డాక్టర్ కె. వి. సుధాకర్ రెడ్డి, డాక్టర్ బి. కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్

పెద్దపల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలను నిబంధన ప్రకారం నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ.రాణికుముదిని అన్నారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణపై కలెక్టర్‌లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించగా కలెక్టర్ కోయ శ్రీహర్ష, పాల్గొన్నారు. కమిషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ వార్డు సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామాలలో ఉప సర్పంచ్ నియామకం జరిగేలా చూడాలన్నారు. ఏకగ్రీవంగా ఎంపికైన సర్పంచ్‌కు ఫారం 10 ప్రకారం ఫలితాల ప్రకటన చేపట్టాలన్నారు. నామినేషన్ల ప్రక్రియ ముగిసిన తర్వాత గ్రామాలలో స్టేజ్ 2 రిటర్నింగ్ అధికారుల నియామకం పూర్తి చేయాలన్నారు. నామినేషన్ల ప్రక్రియ చివరి దశకు చేరుకున్నందున సంబంధిత రిపోర్టులు టీపోల్‌లో నమోదు చేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ కోసం వచ్చిన ప్రతి దరఖాస్తు పరిశీలించి బ్యాలెట్ సౌకర్యం కల్పించాలని, ప్రతి మండలంలో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. బ్యాలెట్ పేపర్ నిబంధనల ప్రకారం ముద్రించాలని అన్నారు. ప్రచారంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలు జరుగకుండా పక్కా నిఘా ఏర్పాటు చేయాలని అన్నారు. లా అండ్ ఆర్డర్ అదనపు డీజీపీ మహేష్ భగవత్ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా నిర్వహించే తనిఖీలలో అక్రమంగా నగదు, మద్యం, ఆభరణాలను ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు తరలించే పక్షంలో సీజ్ చేయాలన్నారు. పోలింగ్ రోజు సరిహద్దు ప్రాంతాల్లో అంతర్రాష్ట్ర చెక్ పోస్ట్ ఏర్పాటు చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలు సీజన్ నడుస్తున్నందున రైతుల వద్ద నుంచి ఆధారాలు పరిశీలించాలని, పంట డబ్బులకు ఆధారాలు ఉంటే సీజ్ చేయవద్దన్నారు. జడ్పీ సీఈఓ నరేందర్, డీపీవో వీరబుచ్చయ్య పాల్గొన్నారు.

మూడో విడత కొనసాగుతున్న నామినేషన్లు



రంగాపూర్‌లో నామినేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న పెద్దపల్లి సీఐ ప్రవీణ్‌కుమార్

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి మండలంలోని 30 గ్రామ పంచాయతీల్లో గురువారం 46 మంది సర్పంచ్ అభ్యర్థులుగా నామినేషన్ దాఖలు చేయగా, 187 మంది వార్డు సభ్యులకు 211 నామినేషన్ దాఖలు చేసినట్లు ఎంపీడీవో కొప్పుల శ్రీనివాస్ తెలిపారు. రంగాపూర్, చీకురాయితో పాటు తదితర గ్రామాల్లో అభ్యర్థులు నామినేషన్ వేసేందుకు రాగా ఆర్వోలు స్వీకరణ ప్రక్రియ నెమ్మదిగా చేస్తున్నారని అభ్యర్థులు ఆరోపించారు. రంగాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో చేపట్టిన నామినేషన్ ప్రక్రియను సీఐ ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. రెండు రోజుల్లో సర్పంచ్‌కు 87, వార్డులకు 366 నామినేషన్లు దాఖలయ్యాయి.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలంలో 27 గ్రామ పంచాయతీలు ఉండగా గురువారం సర్పంచ్ పదవి కోసం 46 నామినేషన్లు దాఖలు చేశారు. వార్డు సభ్యుల పదవి కోసం 178 నామినేషన్లు దాఖలు చేశారు. బుధవారం నాటి నామినేషన్లతో కలపి ఇప్పటి వరకు సర్పంచ్ పదవి కోసం 77, వార్డు సభ్యుల కోసం 262 నామినేషన్లు దాఖలు అయ్యాయి.

ఓదెల, (ఆంధ్రజ్యోతి): ఓదెల మండలంలో 22 గ్రామపంచాయతీలకు గాను గురువారం సర్పంచ్‌లకు 26 నామినేషన్లు, 198 వార్డు స్థానాలకు 112 మంది నామినేషన్లు దాఖలు చేశారు. రెండు రోజుల్లో సర్పంచ్‌కు 49, వార్డులకు 169 దాఖలయ్యాయి.

ఎలిగేడు (ఆంధ్రజ్యోతి): ఎలిగేడు మండలంలోని 12 గ్రామపంచా యతీలకు గురువారం సర్పంచ్‌లకు 20 నామినేషన్లు, 114 వార్డులకు 84 నామినేషన్ దాఖలు కేంద్రాలను తహసీల్దార్ యాకయ్య పరిశీలించారు. రెండు రోజుల్లో సర్పంచ్‌లకు 29, వార్డులకు 130 నామినేషన్లు వచ్చాయి.

సాగు భూములకు పచ్చిరొట్ట జీవం

- రసాయనాల వాడకానికి చెక్
- ఆసక్తి చూపుతున్న రైతాంగం



కొలనూర్‌లో పచ్చిరొట్ట ఎరువులపై అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి

ఓదెల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): విచ్చలవిడిగా రసాయనాల వాడకంతో సాగు భూముల్లో భూసారం తగ్గిపోతోంది. పచ్చిరొట్ట ఎరువులు భూములకు జీవంగా మారి అనేక రకాల పోషకాలను అందిస్తోంది. గతంలో సహజ ఎరువుల వాడకంతో ఎలాంటి కలుషితం కాకుండా రైతులు ధాన్యం దిగుబడులు తీశారు. మార్కెట్లోకి రసాయనాల ఎరువులు వచ్చిన తర్వాత భూములు, గాలి, నీరు, వాతావరణంలో కలుషితం పెరిగిపోయాయి. వీటిని తగ్గించి భూసారం, అధిక ధాన్యం దిగుబడులను పెంచుకునేందుకు పచ్చిరొట్ట సాగు ఏకైక మార్గమని చెప్పవచ్చు. విచ్చలవిడిగా రసాయన మందులు వాడితే భూమిలోని సూక్ష్మ పోషకాలు నశించి పంటల దిగుబడి పడిపోతుందని, వ్యవసాయ శాస్త్రజ్ఞులు, వ్యవసాయ అధికారులు హెచ్చరిస్తున్నారు.

కలుషితంపై సామూహిక దాడి

వరి నాట్లకు ముందు పెసర, ఉలువ, జీలుగు, నువ్వులు సైతం మడికట్లలో చల్లుకొని కలియదున్నాలి. పెసర, జీలుగు మొక్కలు మురిగిపోయి భూముల్లో వాన పాములు (ఎర్రలు) అధికమై భూసారం పెంచడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయి. వరినాట్ల సమయం వచ్చే నాటికి భూముల్లో సేంద్రియ, భూసారం అధికమై పచ్చిరొట్ట ఫలితాలు అందుతాయి. పెసర, జీలుగు, జనుము, పిల్లి పెసర, అలసంద, మినుము, ఉలువ తదితర పప్పు జాతి విత్తనాలు చౌడు భూముల్లో మినహా అన్ని రకాల స్వభావం ఉన్న నేలలకు అనుకూలంగా ఉంటాయి. హరిత ఎరువులైన కానుగ, వేప ఆకు కూడా భూమి ఉత్పాదన్ని పెంచడానికి ఉపయోగపడుతుందని శాస్త్రజ్ఞులు తెలుపుతున్నారు.

రైతులకు సబ్సిడీపై జీలుగు విత్తనాలు

మండలంలోని 22 గ్రామాల రైతులకు 540 క్వింటాళ్ల జీలుగు, 20 క్వింటాళ్ల జనుము బస్తాల కోసం అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. అవసరమున్న మేరకు మరికొన్ని క్వింటాళ్ల సేంద్రియ విత్తనాలను తెప్పించడానికి ఇండెంట్‌ను సిద్ధం చేశారు. ప్రస్తుతం ఓదెల, పొత్కపల్లిలోని మూడు డీసీఎంఎస్ కేంద్రాలకు, కనగర్తిలోని ఆగ్రోస్ సేవ కేంద్రానికి విత్తనాలు వస్తున్నాయి. రైతులకు 50 శాతం రాయితీతో ఈ బస్తాలను అందజేయనున్నారు.

భూముల స్వభావాన్ని మార్చేందుకు రైతులు సిద్ధం కావాలి

భాస్కర్ , మండల వ్యవసాయాధికారి



రసాయనాల వల్ల దెబ్బతిన్న భూముల స్వభావాన్ని మార్చేందుకు ప్రతీ రైతు సిద్ధం కావాలి. పచ్చిరొట్ట ఎరువులతో భూములు సారవంతమవుతాయి. దీంతో రైతుకు అధిక ఖర్చులు తప్పుతాయి. సేంద్రియం వృద్ధి చెంది వరి పంటల్లో ధాన్యం దిగుబడులు పెరుగుతాయి. దీంతో గ్రామాల్లో స్వచ్ఛమైన వాతావరణం, పర్యావరణ రక్షణ, భూమి, నీటి కాలుష్యం తగ్గిపోతుంది.

రైతులకు అధిక లాభాలు

పచ్చిరొట్ట సాగు వల్ల తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు ఉంటున్నాయి. పెసర, జీలుగు, జనుము, పిల్లి పెసర, మినుము, కానుగ, అలసంద విత్తనాలను మే, జూన్ నెలలో మడికట్లలో చల్లుకొని నీటి సౌకర్యాన్ని కల్పించాలి. ఎకరానికి 20 నుంచి 25 కిలోల విత్తనాలు అవసరమవుతున్నాయి. పెసర పూత దశకు వచ్చిన తరువాత కాత ప్రారంభంలోనే మడికట్లలో కలియ దున్నాలి. దీంతో భూమిలో మొక్కకు సరిపోయేంత నత్రజని, కాల్షియం, పొటాష్, భాస్వరం, వృద్ధి చెందుతుంది. దీంతో యూరియా పోటాష్, డీఏపీ ఎరువులు అవసరం ఉండే పరిస్థితి రాదు. ఐదు ఎకరాలకు 60 కిలోల పచ్చిరొట్ట విత్తనాలు చల్లితే ట్రాక్టర్ ఖర్చులతో కలుపుకొని రూ.12 వేలు ఖర్చు అవుతున్నాయి. అధిక ధరలకు లభించే డిఏపి, అమ్మోనియా, యూరియా, పొటాష్ ఎరువుల బాధలు దూరం అవుతాయని, ఒక్కో రైతుకు రూ.నాలుగు వేల మేరకు ఆదా అవుతాయని అధికారులు తెలుపుతున్నారు.

నీవెంటే నేను..

- మొదట భార్య.. తర్వాత భర్త
- 24 గంటల వ్యవధిలో

వృద్ధ దంపతుల మృతి

శంకరపట్నం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వృద్ధదంపతులు 24గంటల వ్యవధిలోనే మృతిచెందిన సంఘటన శంకరపట్నం మండలం ముత్తారం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకరపట్నం మండలం ముత్తారం గ్రామానికిచెందిన కనకం రాజమల్లు(80), రాజవ్వ(73) అనేవృద్ధదంపతులు కొంత కాలంగా వృద్ధాప్యంలో వచ్చే అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. బుధవారం భార్య రాజవ్వ అనారోగ్యంతో మృతి చెందగా, భర్త రాజమల్లు గురువారం మృతిచెందాడు. 24గంటల వ్యవధిలోనే భార్యభర్తలు మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

జీడీకే 2ఏ ఇంక్లైన్‌లో ప్రమాదం

- ఇద్దరు కార్మికులకు గాయాలు

గోదావరిఖని, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-1 పరిధిలోని జీడీకే2ఏ ఇంక్లైన్‌లో గురువారం రెండో షిప్టులో జరిగిన ప్రమాదంలో ఇద్దరు కార్మికులు గాయపడ్డారు. మ్యాన్‌రైడింగ్ చానల్‌కు మరమ్మతులు నిర్వహిస్తుండగా చక్రాలు ఊడిపోయి సునీంద్ర, మహేందర్‌రెడ్డి అనే జనరల్ అసిస్టెంట్ల చేతులపై పడడంతో చేతులకు తీవ్ర గాయాల య్యాయి. వెంటనే వారిని గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించగా తీవ్రంగా గాయపడిన మహేందర్‌రెడ్డిని అక్కడి నుంచి మెరుగైన వైద్యంకోసం కరీంనగర్‌కు తరలించారు. ప్రమాదంపై అధికారులు విచారణ జరుపుతున్నారు.

ఎస్సైపై మానవ హక్కుల కమిషన్ విచారణ

మంథని, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీపాదకాలనీలో కేసు విచారణ పేరిట జరిగిన అవమానభారంతో శీలం రాజ్‌కుమార్ అనేయువకుడు ఇంట్లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడి, చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటనపై మంథని ఎస్‌ఐపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ గురువారం విచారణ జరిపినట్లు హైకోర్టు న్యాయవాది ఇనుముల సత్యనారాయణ తెలిపారు. శీలం రాజ్‌కుమార్ మృతిపై, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ రాష్ట్రమానవ హక్కుల కమిషన్‌లో ప్రజాప్రయోజనార్థం మేరకు ఫిర్యాదుచేయగా కమిషన్ ఆదేశాల మేరకు ఎస్సై రమేష్ వ్యక్తిగతంగా హాజరు కాగా విచారణ అనంతరం కేసును జనవరి 8కి వాయిదా వేసినట్లు తెలిపారు.

రవాణాశాఖ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ

ఇల్లంతకుంట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో రవాణాశాఖ ఆధ్వర్యంలో గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. మండలకేంద్రంలో ఇతర రాష్ట్రాల రిజిస్ట్రేషన్‌తో అనుమతులు లేకుండా నడుస్తున్న లారీ, ట్రాక్టర్లను పట్టుకొని సీజ్‌చేసినట్లు ఎంవీఐ వంశీధర్ పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు సరైన ధ్రువ పత్రాలు ఉంటేనే రోడ్లపైకి రావాలని సూచించారు. వాహనదారులు తప్పనిసరిగా వాహనబీమా చేయించాలన్నారు. వ్యవసాయ ట్రాక్టర్లను రవాణా రంగానికి వినియోగించవద్దని సూచించారు. తనిఖీల్లో కానిస్టేబుల్ ప్రశాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తరం రాయండి.. బహుమతి పొందండి



- రెండు విభాగాల్లో పోటీలు
- ఈ నెల 8 వరకు ఉత్తరాలు పంపేందుకు గడువు

ముత్తారం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతికత పరుగులు పెడుతున్న ప్రస్తుత తరుణంలో కనుమరుగవుతున్న పాత సంప్రదాయాలను మళ్లీ గుర్తు చేసేందుకు తపాల శాఖ సంకల్పించింది. బంధువులకు, మిత్రులకు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలకు ఏదైనా సమాచారం చేరవేయాలంటే ఉత్తరాలు రాసే వారు. ఇది 25 ఏళ్ల క్రితం నాటి ముచ్చట. గతంలో ఉత్తరాలు రాయడం కోసం పోస్ట్ కార్డు, ఇన్‌లాండ్ లెటర్, కవర్ ఉపయోగించే వారు. ప్రస్తుతం సోషల్ మీడియా ప్రభావంతో సమాచారం అందించేందుకు క్షణ కాలం కూడా పట్టడం లేదు. దీంతో కొన్ని ప్రభుత్వ సంస్థలు మాత్రమే తపాలా శాఖ సేవలను వినియోగిస్తుంది. దీని కోసం తిరిగి ఉత్తరాలు రాయడాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో డాయి ఆఖర్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రజలకు లెటర్ టు మై రోల్ మోడల్ అంశంపై పోటీ నిర్వహిస్తోంది. ఈ అంశంపై వ్యాసాలు రాసి పంపాలని, ఈనెల 8వ తేదీ వరకు ఉత్తరాలను పంపించాలని కోరుతోంది.

ఎవరు, ఎలా రాయాలి..

తపాల శాఖ ఉత్తరాలు రాసే పోటీని రెండు విభాగాలు విభజించారు. 18 ఏళ్లలోపు విభాగం, 18 ఏళ్లు దాటిన వారు వ్యాసాలు రాసి పంపాల్సి ఉంటుంది. తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో రాయవచ్చు. ఇన్‌లాండ్ లెటర్‌లో వ్యాసం రాసే వారు 500 పదాలకు మించకుండా, కవర్‌లో రాసే వారు 1000 పదాలకు మించకుండా ఏ4 సైజ్ పేపర్‌లో చేతి రాతతో రాసి పంపాలి. టైప్ చేసి పంపితే అంగీకరించరు. వ్యాసంతో పాటు అభ్యర్థులు తమ వయసు ధ్రువీకరణ పత్రం జత చేయాలి.

తపాల సర్కిల్లో ఉత్తరాలు రాయడంలో విజేతలుగా నిలిచే వారికి ప్రథమ బహుమతి రూ.25 వేలు, ద్వితీయ రూ.10వేలు, తృతీయ బహుమతి రూ.5 వేలు అందిస్తారు. జాతీయ విభాగంలో ప్రథమ రూ.50 వేలు, ద్వితీయ రూ. 25 వేలు, తృతీయ రూ. 10 వేలుపంపిణీ చేస్తారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
సయ్యద్ అజారోద్దీన్, పోస్టల్ అధికారి, మంథని

ఉత్తరాల ద్వారా వ్యాసాలు రాసే పోటీని నిర్వహిస్తూ తపాలా శాఖ వారు బహుమతులు అందిస్తున్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. తమ లేఖలను ద చీఫ్ పోస్టు మాస్టర్ జనరల్, తెలంగాణ సర్కిల్, డాక్ సదన్, అబిడ్స్ హైదరాబాద్ 500001 చిరునామాకు ఈనెల 8వ తేదీలోగా పంపించాలి.

వైన్స్ ఏర్పాటు చేయవద్దని మహిళల రాస్తారోకో

- గ్రామ కార్యదర్శిని నిలదీసిన కాలనీవాసులు

కోరుట్ల రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాలనీలో వైన్స్ ఏర్పాటుకు అనుమతించవద్దని మండలంలోని అయిలాపూర్ గ్రామ మహిళలు ఆందోళనకు దిగారు. వైన్స్‌కోసం షెడ్ నిర్మాణానికి ఎలా అనుమతిని ఇచ్చావని గ్రామకార్యదర్శిని నిలదీశారు. గురువారం మండలంలోని కోరుట్ల అయిలాపూర్ రోడ్డుపై అక్కడి కాలనీవాసులు ఆందోళనకు దిగి రాస్తారోకో చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కొన్ని రోజుల క్రితం మద్యం టెండర్లు నిర్వహించగా స్థానికంగా ఉన్న వైన్స్‌ను కోరుట్ల పట్టణానికి చెందిన వైన్స్ వ్యాపారులకు డ్రా ద్వారా దక్కించుకున్నారు. దీంతో వ్యాపారి అయిలాపూర్ నుంచి కోరుట్లకు వచ్చే రహదారిని ఆనుకోని ఉన్న ఓ స్థలంను లీజ్‌కు తీసుకోని షెడ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న కాలనీకి చెందిన మహళలు వైన్స్ ఇక్కడ ఏర్పాటు చేయవద్దని డిమాండ్ చేస్తూ రాస్తారోకో చేశారు. వైన్స్ ఏర్పాటుచేస్తే కాలనీలో ఉన్న మహిళలు ఇబ్బందులుఎదుర్కొంటారని వైన్స్ ఏర్పాటుకు అనుమతించవద్దన్నారు. దీంతో కార్యదర్శి నవీన్ ఎక్సైజ్‌అధికారుల దృష్టికిసమస్యను తీసుకపోయి పరిష్కారానికి కృషి చేస్తానని హామీఇవ్వడంతో మహిళలు ఆందోళన విరమించారు. కాగా అయిలాపూర్ వైన్స్ గెజిట్‌లో లేదని ప్రచారం జరుగుతోంది. అక్కడ ఉన్న వైన్స్‌ను కోరుట్ల పట్టణానికి మార్చినట్లుగా సమాచారం.



రాస్తారోకో చేస్తున్న మహిళలు

అనుమతి లేని షెడ్.. ట్యాక్స్ చెల్లించని ఫంక్షన్ హాల్ సీజ్

కోరుట్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని మున్సిపల్ అధికారులు అనుమతి లేని షెడ్‌తో పాటు ట్యాక్స్ చెల్లించని ఫంక్షన్‌హాల్‌ను సీజ్‌చేశారు. గురువారం పట్టణంలోని నందిచౌరస్తా ప్రాంతంలో నూతనంగా నిర్మించిన షెడ్‌కు నిర్మాణ అనుమతి లేకపోవడంతో సీజ్ చేసినట్లు టౌన్‌ప్లానింగ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్ రవీందర్ తెలిపారు. అదేవిధంగా పట్టణంలో మెట్‌పల్లి రోడ్డులోని ఓ ఫంక్షన్‌హాల్ రూ.14లక్షలు పెండింగ్‌లో ఉండగా సీజ్‌చేసినట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు.



ఫంక్షన్ హాల్‌ను సీజ్ చేస్తున్న మున్సిపల్ అధికారులు

జీపీవో సస్పెన్షన్.. కేసు నమోదు

- రికార్డులో భూవిస్తీర్ణం పెంచి.. మరొకరి పేరు చేర్చిన వైనం

మల్యాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): భూరికార్డులో భూవిస్తీర్ణం పెంచి, మరొకరి పేరు చేర్చి అక్రమంగా భూపట్టా చేసిన మండలంలోని బల్వంతాపూర్ జీపీవో ఈ ప్రవీణ్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఉత్తర్వులు జారీచేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని తాటిపల్లికి చెంది ధర్మవ్వకు చెందిన సర్వేనంబర్ 290/9లో అయిదు ఎకరాల భూమి ఉండగా భూమి పహనిలో భూవిస్తీర్ణం మరో 2.20ఎకరాలకు పెంచి అక్రమాలకు పాల్పడినట్లు అధికారులు గుర్తించి జీపీవోపై సస్పెన్షన్ వేటువేశారు. ధర్మవ్వ పహనీల కోసం దరఖాస్తు చేసుకోగా పెంచిన భూవిస్తీర్ణంను 2.20ఎకరాలను జవ్వాజి జలజ పేరిట నమోదు చేసినట్లు గుర్తించి అధికారులకు ఫిర్యాదు చేశారు.

విచారణ జరిపిన అధికారులు ప్రభుత్వ రికార్డులు, పహనీలను ట్యాంపరింగ్ చేసినట్లు గుర్తించారు. దీంతో తహసీల్దార్ వసంత ఫిర్యాదు మేరకు జీపీవో ప్రవీణ్, జలజపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

తల్లిదండ్రుల బాగోగులు చూడని కుమారుడికి నెల రోజుల జైలు

జగిత్యాల టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తల్లితండ్రుల బాగోగులు చూడని కుమారుడికి నెల రోజులు జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ జగిత్యాల మొదటి అదనపు జేఎఫ్‌సియం కోర్టు న్యాయమూర్తి శ్రీనిజ కోహిల్కర్ తీర్పు చెప్పారు. జగిత్యాల పట్టణం గంజ్ స్ట్రీట్‌కు చెందిన వయోవృద్ధులైన మండలోజు సత్యవతితోపాటు ఆమెభర్త బాగోగులు చూసుకోకుండా ఇళ్లను రిజిస్ట్రేషన్ చేయమని తన కొడుకు రమేష్ ఇబ్బందులకు గురిచేస్తున్నాడని 2021లో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి సీఐ కిషోర్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టి చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రస్తుత సీఐ కరుణాకర్ సూచనల మేరకు హెడ్ కానిస్టేబుల్ ఏ రాజేశ్వరరావు కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా పీపీ బి. రాజేష్ బాధితురాలు తరుపున వాదించారు. సాక్ష్యాలు పరిశీలించి, విచారణ అనంతరం న్యాయమూర్తి శ్రీనిజ కోహిల్కర్ నిందితుడికి నెల రోజులు జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

కొండలరాయుడి కోటపై నుంచి దూకిన యువకుడు

మల్యాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు కొండపైన గల కొండలరాయుడి కోటనుంచి మతిస్థిమితంలేని వ్యక్తి దూకగా తీవ్రగాయాలతో బయటపడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట జిల్లా మద్దునూరు మండలం జాలపల్లికి చెందిన యాసవేణి ధీరజ్ అనే యువకుడు కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో కుటుంబసభ్యులు వారంరోజుల క్రితం కొండగట్టు అంజనేయస్వామి సన్నిధికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో కొండపైన ఉంటున్న మతిస్థిమితం సరిగాలేని ధీరజ్ గురువారం ఆలయం వెనకాల గల కొండలరాయుడి కోట బండరాళ్ల వద్దకు వెళ్లి లోయలోకి దూకాడు. గమనించిన అక్కడున్న కొందరు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పోలీస్ అవుట్‌పోస్టు ఏఎస్సై చిలుక శ్రీనివాస్, హోంగార్డులు రాజేశ్, వెంకటేశ్, సెక్యూరిటీ గార్డు కుమార్ కొంతమంది భక్తులు కలిసి అతన్ని లోయ నుంచి బయటకు తీసుకువచ్చారు. ధీరజ్‌కు వెనుక వైపులో గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

కొంగుకు నిప్పంటుకొని వృద్ధురాలికి తీవ్ర గాయాలు

కోరుట్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మి అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న వాసాల పద్మ(85) అనే వృద్ధురాలి చీరకొంగుకు నిప్పంటుకోవడంతో తీవ్రగాయాలు అయినట్లు స్థానికులు తెలిపారు. అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న తన కూతురు వకుల ఇంటికి వచ్చిన పద్మ చలికాలం ఎండ కోసం గ్యాలరీ పక్కన ఉన్న కుర్చీలో కూర్చొంది. పక్కన తులసిచెట్టు వద్ద దీపం వెలిగించి ఉండగా ప్రమాదవశాత్తూ వృద్ధురాలి చీర కొంగు దీపంపై పడి మంట అంటుకుంది. ఘటనలో పద్మ తీవ్ర గాయాల పాలు కాగా కుటుంబసభ్యులు చికిత్సనిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాదు తరలించినట్లు స్థానికులు తెలిపారు.

తండాలో పోలీసుల సోదాలు

- 80 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం..
- 10 లీటర్ల సారా స్వాధీనం

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం రాశిగుట్టతండాలో ఎస్‌ఐ లక్ష్మణ్ ఆధ్వర్యంలోని పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. పలువురి ఇళ్లల్లో సోదాలు జరిపారు. సారా తయారీ కేంద్రాలను కనుగొన్నారు. నిల్వచేసిన 80లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. తరలించేందుకు సిద్ధంగా ఉన్న 10 లీటర్ల సారాను స్వాధీనపర్చుకున్నారు. తయారీదారులు నేమీ, కవితపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ లక్ష్మణ్ పేర్కొన్నారు.

తవ్వారు.. వదిలేశారు..

మానకొండూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగిపల్లిలో తాగునీటి పైపు లైన్ కోసం రోడ్డు పక్కన గుంత తవ్వి వదిలేయడంతో ప్రమాదకరంగా మారింది. గుంతను పూడ్చివేయాలని కాలనీవాసులు, వాహనదారులు కోరుతున్నారు. గంగిపల్లి ఎస్సీకాలనీ, కొండపల్కలకు వెళ్లే ప్రధాన రహదారి పక్కన పైప్‌లైన్ నిర్మాణం కోసం గుంత తవ్వి వదిలేశారు. సింగిల్ తారు రోడ్డు కావడంతో పెద్ద వాహనం వెళ్లే సమయంలో స్థలం సరిపోక ప్రమాదాలు జరుగుతున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించాలని, గుంత పూడ్చివేతకు చర్యలు చేపట్టాలని కోరారు.



గంగిపల్లిలో రోడ్డు పక్కన తవ్వి వదిలేసిన గుంత

రానున్న వేసవికి పటిష్ట కార్యాచరణతో సిద్ధంగా ఉండాలి

- అధికారులతో సమీక్షలో ఎస్ఈ మేక రమేష్‌బాబు

గణేశ్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవి కాలంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా కార్యాచరణతో సిద్ధంగా ఉండాలని విద్యుత్ అధికారులకు సూపరింటెండింగ్ ఇంజనీర్ కరీంనగర్ మేక రమేష్‌బాబు దిశానిర్దేశం చేశారు. గురువారం సమావేశమందిరంలో ఏర్పాటు చేసిన సమీక్షలో ఆయన మాట్లాడారు. రాబోయే వేసవి కార్యచరణ ప్రణాళిక సిద్ధంగాఉండాలని ఏఈలకు, ఏడీలకు సూచించారు. ఎక్కడైతే పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఓవర్‌లోడ్ అయ్యే అవకాశం ఉందో అక్కడ అదనపు సామర్థ్యం పెంపుదల ట్రాన్స్‌ఫార్మర్ పెట్టాలని ఆదేశించారు. 33కేవీ, 11కేవీ లైన్లు ఓవర్ లోడ్ అయ్యే అవకాశం ఉన్నచోట కొత్త లైన్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. వినియోదారులకు అంతరాయం లేకుండా 33కేవీ, 11కేవీ మెయింటెనెన్స్ చేయాలన్నారు. వ్యవసాయ సర్వీస్ అప్లికేషన్లు 15 రోజుల్లోపు సర్వీస్ కనెక్షన్ ఇవ్వాలని, గృహ, వాణిజ్య మీటర్లు ఏడు రోజుల్లోపు రిలీజ్ కావాలని ఆదేశించారు. 1912ఫోన్ ద్వారా వినియోగదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే విద్యుత్ ప్రమాదాలు జరగకుండా పొలంబాట, పల్లెబాట, బస్తీబాట, పట్టణబాట నిర్వహించి వినియోదారులకు అవగాహన సదస్సు నిర్వహించి విద్యుత్‌ప్రమాదాలు జరగకుండా అవగాహన కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో డీఈలు కె ఉపేందర్, రాజం, లక్ష్మారెడ్డి, ఎం తిరుపతి, ఎస్ఏవో రాజేంద్ర ప్రసాద్, ఏవోలు, ఏఏవోలు, ఏడీఈలు, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ మేక రమేష్‌బాబు

ఉమ్మడి జిల్లాలో నలుగురి బలవన్మరణం

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నలుగురు వివిధ కారణాలతో బలవన్మరణానికి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళితే..

రైలు కిందపడి ఒకరి ఆత్మహత్య



రజనీకాంత్(ఫైల్)

జమ్మికుంట రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం బిజిగిరిషరీఫ్-పొట్కపల్లి రైల్వేస్టేషన్ల మధ్య గుర్తుతెలియని రైలు కిందపడి ఓ వ్యక్తి గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జమ్మికుంట మండలం తనుగుల గ్రామానికిచెందిన జక్కె రజనీకాంత్(31) అనేవ్యక్తి కూలి పనిచేస్తూ జీవనం సాగించేవాడు. ఏడాదిగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు ఆసుపత్రుల్లో చూపించినా ఆరోగ్యం కుదుటపడలేదు. దీంతో తీవ్ర మనస్థాపం చెంది బిజిగిరి షరీఫ్-పొట్కపల్లి రైల్వేస్టేషన్ల మధ్య గుర్తుతెలియని రైలుకిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి రమ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తు న్నట్లు రామగుండం రైల్వేహెడ్ కానిస్టేబుల్ జి తిరుపతి తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య



రాజిరెడ్డి(ఫైల్)

ముస్తాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఇందిరమ్మకాలనీలో మద్యానికి బానిసై ఓవ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చోటుచేసుకుంది. ఎస్సై సీహెచ్ గణేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ముస్తాబాద్‌కు చెందిన సద్ది రాజిరెడ్డి(40) భార్య కొన్నేళ్లక్రితం చనిపోయింది. రాజిరెడ్డి డ్రైవర్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొద్దిరోజులుగా పనిలేకపోవడంతో మద్యానికి బానిసైన రాజిరెడ్డి ఒంటరితనంతో మనస్థాపంచెంది బుధవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడితల్లి సత్తవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు.

తల్లిదండ్రులు మందలించారని ఉరి వేసుకున్న యువకుడు



అరవింద్(ఫైల్)

పెగడపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండలం రాములపల్లి గ్రామానికి చెందిన నీలం అరవింద్(23) అనేయువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాములపల్లి గ్రామానికి చెందిన నీలం అరవింద్ బీటెక్ పూర్తిచేసి ఉద్యోగాన్వేషణలో ఉండగా బుధవారం సాయంత్రం తల్లిదండ్రులు ఏదైనా పనిచేసుకుని బతకాలని సూచించగా మనస్థాపంతో ఇంట్లోనే ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్సనిమిత్తం జగిత్యాల ఆసుపత్రికి తరలించగా రాత్రి చనిపోయినట్లు తెలిపారు. మృతుడి తండ్రి రమేష్ ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కిరణ్ కుమార్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్య



అంజవ్వ(ఫైల్)

చందుర్తి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో ఓ మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చందుర్తి మండలం బండపల్లిలో జరిగింది. గ్రామస్థుల, చందుర్తి ఎస్సై రమేష్ కథనం ప్రకారం... మండలంలోని బండపల్లి గ్రామానికి చెందిన నేదూరి అంజవ్వ(55) అనే మహిళకు భర్త పోశయ్యతో పాటు ముగ్గురు కుమారులు ఉన్నారు. జీవనోపాధి కోసం హార్వెస్టర్ కొనుగోలు చేయగా ఆర్థికంగా నష్టపోయారు. హార్వెస్టర్ విక్రయించిన అప్పులు తీరలేదు. వ్యవసాయంలో వచ్చిన నష్టంతో పూర్తిగా దివాళా తీశారు. దీంతో అప్పులిచ్చినవారు చెల్లించాలని కోరారు. ముగ్గురుకుమారులు పట్టించుకోకపోవడంతో తీవ్రమనస్థాపానికి లోనైనా అంజవ్వ ఇంట్లో ఉరివేసుకుంది. భర్త పోశయ్య ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రమేష్ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ దుర్మరణం




జితేందర్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పొలాన్ని దున్నేందుకు గురువారం కేజ్‌వీల్స్‌ను ట్రాక్టర్ వెనుక నాగళ్లపై వేసుకుని వెళ్తున్న క్రమంలో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ గడ్డం జితేందర్(36) దుర్మరణం పాలయ్యాడు. కుటుంబ సభ్యులు, ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి కథనం మేరకు.. జితేందర్ గ్రామానికి చెందిన శ్రీను అనేవ్యక్తి ట్రాక్టర్‌ను నడుపుతూ జీవిస్తున్నాడు. పొలాన్ని దున్నేందుకు ట్రాక్టర్ వెనుకఉన్న నాగళ్లపై కేజ్‌వీల్స్ వేసుకుని వెళుతున్న క్రమంలో ఒక్కసారిగా కేజ్‌వీల్స్ ఎగిరి కిందిపడ్డాయి. దీంతో జితేందర్ వాహనం వెనుక వైపునకు చూడడం వల్ల ట్రాక్టర్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న వ్యవసాయ పొలంలో బోల్తాపడింది. చుట్టుపక్కల రైతులు గమనించి ట్రాక్టర్ కింద చిక్కుకున్న ఆయను తీసేందుకు యత్నించారు. మరోట్రాక్టర్ సహాయంతో బోల్తాపడిన వాహనాన్ని తొలగించారు. అప్పటికే జితేందర్ చనిపోయాడు. మృతుడికిభార్య దివ్య, కొడుకు విశాల్, తల్లి లక్ష్మి ఉన్నారు. ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు అక్కడకు చేరుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

వెల్గటూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిషన్‌రావుపేట గ్రామశివారులో ఈనెల29న రోడ్డుప్రమాదంలో గాయపడిన లక్ష్మణ్‌రావు (36) అనేయువకుడు చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపిన వివరాలప్రకారం.. ఈనెల29న రాత్రి సమయంలో ముత్తునూర్ గ్రామానికిచెందిన గొల్లకల్యాణ్, కొత్తపేట గ్రామానికి చెందిన లక్ష్మణ్‌రావు ఎదురెదురుగా ద్విచక్రవాహనాలపై ప్రయాణిస్తూ ఢీకొ న్నారు. ఈ సంఘటనలో లక్ష్మణ్‌రావు తలకు తీవ్ర గాయాలు కాగా కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. కాగా పరిస్థితి విషమించడంతో గురువారం చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబాన్ని పోషించే పెద్దదిక్కును కోల్పోవడంతో ఆ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడి భార్య సహజ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు.

కువైట్‌లో ముస్తాబాద్‌వాసి మృతి



వేదుల్(ఫైల్)

ముస్తాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన ఎండీ వేదుల్(36) కువైట్‌లో అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతిచెందాడు. వేదుల్ నాలుగు నెలలక్రితం ఫుడ్ పాయిజన్‌తో అనారోగ్యానికి గురయ్యాడు. ఆసుపత్రిలో చికిత్సపొందుతూ పరిస్థితివిషమించి మృతి చెందాడు. వేదుల్‌కు భార్య షబానా, ఇద్దరు పిల్లలున్నారు. పేదకుటుంబానికి చెందిన వేదుల్ మృతదేహం స్వగ్రామం చేరేలా చూడాలని కుటుంబసభ్యులు వేడుకుంటున్నారు.

కుక్కల దాడిలో మేకలు మృతి

ఎండపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుల్లకోట గ్రామంలో గురువారం రోజున కుక్కలదాడిలో 12మేకలు మృతిచెందాయి. బాధితుడి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అమరగొండ దివాకర్ మేకలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగే మేపడానికి వెళ్లాడు. అనా రోగ్యంతో నడవలేని కొన్ని మేకలను గూటిలో వేసి మిగతా వాటితో వెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో ఎవరూలేని సమయంలో ఒక్కసారిగా కుక్కలుమేకలపై దాడిచేసి చంపాయి. వాటివిలువ సుమారు లక్షపైగా ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని దివాకర్ వేడుకుంటున్నాడు.

ఎస్‌జీఎఫ్ రాష్ట్ర క్రికెట్ పోటీలకు గంగాధర విద్యార్థి


అస్లాం

గంగాధర, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గంగాధర ప్రభుత్వ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థి అస్లాం ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ బాబు శ్రీనివాస్ తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో అండర్ 14 ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించగా పాఠశాలకు చెందిన అస్లాం అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైయినట్లు పీడీ తెలిపారు. ఈ నెల 5 నుండి 7 వరకు భద్రాది కొత్తగూడెం జిల్లా హస్నాపురంలో జరగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారుడిని ప్రధానోపాధ్యాయురాలు అనితకుమారి, ఎంపీడీవో రాము, ఎంఈవో ప్రభాకర్‌రావు, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక


ఈర్ల శ్రీజ

ధర్మపురి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని మగ్గిడి ఆదర్శ కళాశాల విద్యార్థి ఈర్ల శ్రీజ అండర్ 19 ఖోఖో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో ఇటీవల జరిగిన ఖోఖో పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచింది. హైదరాబాద్‌లో ఈ నెల 6, 7వ తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి విద్యార్థి శ్రీజ ప్రాతినిధ్యం వహిస్తోంది. శ్రీజను ఆదర్శ కళాశాల ప్రిన్సిపాల్ పద్మ, వైస్ ప్రిన్సిపాల్ మహేష్, ఫిజికల్ డైరెక్టర్ రాజేందర్, అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు.

కొండగట్టులో గిరి ప్రదక్షిణ


మల్యాల, డిశంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రతి పౌర్ణమి రోజు కొండగట్టు ఆంజనేయస్వామి గిరుల చుట్టూ నిర్వహిస్తున్న గిరిప్రదక్షిణ గురువారం నిర్వహించారు. హైదరాబాద్ చిలుకూరు బాలాజీ ఆలయంలోని శివాలయం ప్రధానార్చకులు సురేశ్ ఆత్మారాం మహారాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన గిరిప్రదక్షిణకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. అయ్యప్ప దీక్షాపరులు దిగువ కొండగట్టులో పూజలు నిర్వహించి ప్రదక్షిణ ప్రారంభించారు. గిరి ప్రదక్షిణ ముగిసిన అనంతరం కొండపైన స్వామి వారిని దర్శించుకున్నారు.

లక్ష్మీనర్సింహస్వామి కల్యాణోత్సవం


శ్రీ లక్ష్మీనర్సింహస్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

తంగళ్లపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండల కేంద్రంలోని లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. చినజీయర్‌స్వామి శిష్య బృందం శ్రీకాంత్ ఆచార్యులు, రామకృష్ణమాచార్యులు, శశాంక్, వినయ్‌కుమార్ ఆచార్యులు, శ్రీకాంతకౌశిక్, వివేక్ స్వామిలే వేదమంత్రాలతో కల్యాణం నిర్వహించగా వేలాది మంది భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మాజీ జడ్పీటీసీ కోడి అంతయ్యతో పాటు భక్తుల సహకారంతో అన్నదానం నిర్వహించారు.

ఎన్నికల నిబంధనలు కఠినం



అభ్యర్థులకు ఎన్నికల ఖర్చు వివరాలు

సర్పంచ్ స్థానానికి పోటీ చేసే అభ్యర్థి గ్రామ జనాభా 5 వేల లోపు ఉంటే లక్షా 50 వేల రూపాయలు, వార్డు సభ్యుడికి పోటీ చేసే అభ్యర్థి 30 వేలు, 5 వేల జనాభా దాటితే 2.50 లక్షల రూపాయలు, వార్డు సభ్యుడు అభ్యర్థి 50 వేల రూపాయలకు మించకుండా ఖర్చు చేయాల్సి ఉంటుంది. అభ్యర్థుల గెలుపు కోసం రాజకీయ పార్టీలు పెట్టే ఖర్చును అభ్యర్థుల ఖాతా ల్లోనే జమ చేస్తారు.

పాటించకపోతే పదవీ గండం

మూడేళ్ల పాటు పోటీలకు దూరం

సుల్తానాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నియమ నిబంధనలు కఠినంగా ఉన్నాయి. అభ్యర్థులు తెలిసి తెలియక వాటిని ఉల్లంఘిస్తే ఇబ్బందులు పడాల్సి ఉంటుంది. ముఖ్యంగా అభ్యర్థులు తమ ఎన్నికల నామినేషన్లు దాఖలు చేసిన రోజు నుంచి పక్కగా లెక్కలు పరిగణనలోకి వస్తాయి. రూపాయి రూపాయి లెక్క చేస్తారు. ఎవరు చూస్తున్నారంటూ నిర్లక్ష్యం చేస్తే గెలిచాక పదవి ఊడిపోతుంది. దీంతో పాటు మరో మూడేళ్ల పాటు ఏ ఎన్నికలలో పోటీ చేయకుండా అనర్హత విధిస్తారు. అందుకుని గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు తమ ఎన్నికల ప్రచారంలో భాగంగా చేసే ప్రతీ ఖర్చు వివరాలను ఎన్నికల సంఘానికి తప్పకుండా తెలుపాలి.

అయితే ఎన్నికలకు సంబంధించిన ఖర్చులన్నీంటినీ కొత్త బ్యాంక్ ఖాతా ద్వారా మాత్రమే నిర్వహించాల్సి ఉంటుంది. ఎన్నికలకు సంబంధించిన లావాదేవీ లన్నింటినీ ఆ ఖాతా ద్వారా మాత్రమే నిర్వహించాలి. ప్రతీ అభ్యర్థి తన గెలుపు ఓటములతో సంబంధం లేకుండా ఎన్నికలు ముగిసిన 45 రోజుల లో తనకు సంబంధించిన ఎన్నికల ఖర్చు వివరాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు సమర్పించాలి.

ఒకవేళ గెలిచిన అభ్యర్థులు ఆ సంబరంలో సకాలంలో ఖర్చు వివరాలను అధికారులకు ఇవ్వడం మరిచిపోతే పదవి కోల్పోవడంతో పాటు మూడేళ్ల అనర్హత వేటు పడుతుంది.

మర్చిపోకుండా ఎన్నికల ఖర్చు వివరాలను గెలుపు ఓట ములతో సంబంధం లేకుండా నిర్ణీత గడువులోగా అధికారులకు సమర్పించాలి. అభ్యర్థులు తమ ఎన్నికల ప్రచారంలో భాగంగా చేస్తున్న అన్ని ఖర్చులను ఎన్నికల కమిషన్‌కు సంబంధించిన నిఘా బృందాలు గమనిస్తూ ఖర్చును అంచనా వేస్తుంటాయి. నిఘా బృందాలు రికార్డు చేసిన ఖర్చు మొత్తాన్ని కూడా అభ్యర్థుల పేరుతో నమో దు చేస్తాయి. సాధ్యమనంత వరకు ఎన్నికల వ్యయ పరిమితికి లోబడి మాత్రమే ఖర్చులు చేస్తూ వాటిని నమోదు చేసుకోవాలి.

అభ్యర్థుల ఖర్చుపై ఎప్పటికప్పుడు సర్వైవల్ టీమ్స్, ఎన్నికల వ్యయ పరిశీలకులు, వీడియోలు, ఫొటోల చిత్రీకరణ చేసి ఖర్చును లెక్కిస్తారు. అభ్యర్థులు చేసిన ఖర్చుకు సంబంధించి తక్కువ చేసి లెక్క లు సమర్పించినప్పుడు వీడియోలు, ఫొటోలను పరిశీలించి సరి చేస్తారు. ఎన్నికల కోసం వాడే ప్రచార సామగ్రి, తదితర వాటికి ఎన్నికల సం ఘం ధరలు నిర్ణయించింది. ఆ ధరల ప్రకారమే అభ్యర్థులు ఎన్నికల ఖర్చు చూపాల్సి ఉంటుంది. ఎన్నికల సందర్భంగా అభ్యర్థులు బ్యానర్లు, పోస్టర్లు, కరపత్రాలు, బ్యాడ్జీలు, వాల్ రైటింగ్స్, నమూనా బ్యాలెట్లు, తదితర ముద్రించి ఓటర్లకు పంపిణీ చేస్తారు. ప్రచారానికి మైకులు, లౌడ్ స్పీకర్లు వినియోగిస్తుంటారు. వీటన్నింటికీ ఎన్నికల సంఘం ధరలు నిర్ణయించింది.

13న నవోదయ ప్రవేశ పరీక్ష

చొప్పదండి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 13న నవోదయ 6వ తరగతి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బ్రహ్మానందరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 34 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు 6,892 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. విద్యార్థులు తమ అడ్మిట్ కార్డులను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని, అడ్మిట్ కార్డులో ఏవైనా పొరపాట్లు ఉంటే ఈ నెల 6లోగా చొప్పదండిలోని నవోదయ విద్యాలయంలో సరిచేయించుకోవాలన్నారు. మార్పులు ఏవైనా ఉనట్లయితే సంబంధిత ఆధార పత్రాలు తీసుకొని విద్యాలయానికి రావాలని ఆయన సూచించారు.

విద్యారంగ సమస్యలపై ఏబీవీపీ కృషి

గణేశ్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలపై ఏబీవీపీ కృషి చేస్తుందని, భారత్‌ను విశ్వగురు స్థానంలో నిలపడమే లక్ష్యమని సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్యాల రాకేష్ అన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత నెల 28, 29, 30 తేదీల్లో ఉత్తరాఖండ్‌లో సంఘం 71వ జాతీయ మహాసభలు నిర్వహించినట్లు చెప్పారు. ఏబీవీపీ ఉద్యమాలు, విజయాలు, రావాల్సిన మార్పులపై చర్చించామన్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా కన్వీనర్ పూసాల విష్ణు, నగర కార్యదర్శి చిప్ప యోగేష్, వంశీ,శివ , ఆకాష్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం దాసోహం

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బీజేపీ పది సంవత్సరాల పాలనలో కార్పొరేట్ సంస్థలు, బడా పెట్టుబడుదారులైన అంబానీ, ఆదానీలు వేల కోట్ల రూపాయలు సంపాదించుకున్నారని, కార్పొరేట్లకు కేంద్ర ప్రభుత్వం దాసోహమైందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం సీపీఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలో మూడవ ఆర్థిక దేశంగా భారతదేశం రూపొందుతోందని ప్రధానమంత్రి అబద్ధాలు చెపుతున్నాడని అన్నారు. బీఎస్ఎన్ఎల్, విశాఖ స్టీల్ ప్లాంట్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను ధ్వంసం చేస్తున్నారన్నారు. బ్యాంకులను ప్రైవేటుపరం చేసే కుట్రలు చేస్తున్నారన్నారు. బూటకపు ఎన్‌కౌంటర్లపై జ్యూడీషియల్ ఎక్వైరీ వేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ పచ్చని కొబ్బరిచేలను చూసి తెలంగాణ వారి కళ్లు మండుతున్నాయనడం ఆయన అహంకార పూరిత వ్యాఖ్యలకు నిదర్శనమన్నారు. సిరిసిల్ల, కరీంనగర్, జగిత్యాల జిల్లాలు పచ్చని పొలాలతో విలసిల్లుతున్నాయన్నారు. నిస్వార్థంగా ప్రజాసేవ చేసే వారినే ఎన్నుకోవాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి 73, 74 రాజ్యాంగ సవరణ ఎందుకు అమలు చేయలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ సర్పంచ్‌ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వారి పరిస్థితి ఏమిటన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సుదర్శన్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

జనవరి 7న శబరిమలకు ప్రత్యేక రైలు

పెద్దపల్లి, డిసెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప స్వామి భక్తుల సౌకర్యార్థం శబరిమలకు జనవరి 7వ తేదీన మరో ప్రత్యేక రైలు నడుపుతామని దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రకటించారు. రైలు నంబర్ 07133 నాందేడ్ నుంచి ఉదయం 4:25 గంటలకు బయలుదేరుతుంది.. కోరుట్లకు 8:30 గంటలకు, జగిత్యాలకు 9 గంటలకు, కరీంనగర్‌కు 10 గంటలకు, పెద్దపల్లి జంక్షన్‌కు 10:50 గంటలకు చేరుకోనున్నది. ఇక్కడి నుంచి 11:40 గంటలకు బయలు దేరి జమ్మికుంట 12:20, వరంగల్‌కు మధ్యాహ్నం 1:18 గంటలకు, తిరుపతికి రాత్రి 1:20 గంట లకు, కొల్లాం మరుసటి రోజు రాత్రి 10 గంటలకు చేరుకోనున్నది. తిరుగు ప్రయాణంలో రైలు నంబర్ 07134 కొల్లాం నుంచి ఉదయం 2:30 గంటలకు బయలు దేరి, నాందేడ్‌కు మరుసటి రోజు సాయంత్రం 5:30 గంటలకు చేరుకోనున్నది.

అరటి సాగుపై రైతులు దృష్టిసారించాలి


అరటి తోటను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన అధికారులు

జగిత్యాలరూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతులు సంప్రదాయ వరి పంటనే కాకుండా అధిక ఆదాయాన్ని అందించే అరటి సాగుపై దృష్టి సారించాలని జగిత్యాల జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి జి.శ్యాం ప్రసాద్ రైతులకు సూచించారు. జగిత్యాల రూరల్ మండలంలోని అంతర్గాంలో పండిస్తున్న అరటి తోటలను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరటి మొక్కలు నాటుకోవడానికి అనువైన సమయమని అన్నారు. టిష్యూకల్చర్ అరటి మొక్కలు తెచ్చి నాటుకుంటే అధిక దిగుబడి వస్తుందన్నారు. బిందు సేద్యం ద్వారా నీరు అందిస్తే కలుపు సమస్య తక్కువగా ఉండి అధిక దిగుబడి సాధించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో నియోజవర్గ ఉద్యాన అధికారి కె. స్వాతి, ఉద్యాన విస్తరణ అధికారి అన్వేష్ ఉన్నారు.

వర్గీకరణతో మాల సామాజిక వర్గానికి సీఎం అన్యాయం


మాట్లాడుతున్న మాల సంఘాల జేఏసీ చైర్మన్ మందాల భాస్కర్

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విస్మరించి మాల సామాజిక వర్గానికి రిజర్వేషన్లు లేకుండా గొంతు కోశాడని తెలంగాణ మాల సంఘాల జేఏసీ చైర్మన్ మందాల భాస్కర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రం అంబేద్క ర్ చౌరస్తాలోని బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి జేఏసీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం మాల సామాజిక వర్గానికి చెందిన 26 కులాలను రిజర్వేషన్లు లేకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఆరు నెలలుగా ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలలో వేయి పోస్టులకు మాల సామాజిక వర్గానికి 28 పోస్టులు వచ్చాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్లు చేస్తుంటే కాంగ్రెస్‌లో ఉన్న మాల సామాజిక వర్గానికి చెందిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి, స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఎంపీలు, ఎమ్మెల్యేలు కళ్లు మూసుకున్నారన్నారు. మాల సామాజిక వర్గం సత్తా చాటకపోతే భవిష్యత్తులో విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉండవన్నారు. సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్‌ను ముఖ్యమంత్రి పాటించి ఉండే మాల సామాజిక వర్గానికి ఏడు శాతం రిజర్వేషన్లు వచ్చేవని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు చెరుకు రామ్‌చందర్, గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ బేరా బాలకిషన్, వైస్ చైర్మన్ తుమ్మ శ్రీనివాస్, ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ తుంగ శివరాజ్, కో కన్వీనర్ జక్కుల యాదగిరి, స్టూడెం ట్ జేఏసీ చైర్మన్ మాదాసి రాహుల్, ఓయూ జేఏసీ చైర్మన్ బత్తుల రమేష్, జిల్లా నాయకులు బూర యాదగిరి, బొల్లం గణేష్, పాటి రాజ్‌కుమార్ ఉన్నారు.

ధాన్యంలో కోతపై రైతుల ఆందోళన

చొప్పదండి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుక్మాపూర్‌లో రాయపట్నం రహదారిపై కాట్నపల్లికి చెందిన పలువురు రైతులు ఆందోళన నిర్వహించారు. ధాన్యం కొనుగోళ్లలో కోత విధించారని రైస్ మిల్లర్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళన చేశారు. ధాన్యం నాణ్యంగా ఉన్నప్పటికీ 42 కిలోల బస్తా తూకం వేసి పంపినప్పటికీ అదనంగా మరో కిలో కోత విధించారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమాచారం తెలుసుకున్న అధికారులు రైతులతో మాట్లాడగా శాంతించారు.

డిపో మేనేజర్లతో సమావేశం

భగత్‌నగర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఆర్టీసీ రీజియన్ పరిధిలోని డిపో మేనేజర్లతో గురువారం రీజినల్ మేనేజర్ బి రాజు సమీక్ష సమావేశం నిర్వహించారు. నవంబరు మాసాంతం వరకు అన్ని డిపోల పనితీరు, పరమాదాలు నివారణ చర్యలు, రానున్న మేడారం జాతర ఏర్పాట్లు, శబరిమలై ప్యాకేజీ టూర్లు, యాత్రాదానంకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణపై సమీక్షించారు. ఈ సమావేశంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్లు ఎస్ భూపతిరెడ్డి, పి మల్లేశం, అన్ని డిపోల మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్ట్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష


ఎయిర్‌పోర్ట్ అథారిటి అధికారులతో ఎమ్మెల్యే మక్కాన్ సింగ్

జ్యోతినగర్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): అంతర్గాం మండల కేంద్రంలోని ప్రతిపాదిత విమానాశ్రయ ఏర్పాటు స్థల పరిశీలనకు ఢిల్లీ నుంచి వచ్చిన ఎయిర్‌పోర్ట్ అథారిటీ అధికారులు బానోతు శ్రీనివాస్ తదితర బృంద సభ్యులను ఎమ్మెల్యే మక్కాన్ సింగ్‌ఠాకూర్ కలిశారు. ఎన్టీపీసీ జ్యోతిభవన్‌లో ఎమ్మెల్యే వారిని కలిసి చర్చించారు. ప్రతిపాదిత 977 ఎకరాల స్థలాన్ని అధికారులు పరిశీలించగా, గతంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులతో సమీక్షించినట్లు ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే పూర్తిస్థాయిలో ఫిజిబిలిటి రిపోర్టు తయారు చేస్తున్నామని, అనంతరం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతామని ఎమ్మెల్యేకు అధికారులు తెలిపారు. భవిష్యత్‌లో ఎయిర్‌పోర్టు ఏర్పాటు వల్ల ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు ఆదిలాబాద్ జిల్లా ప్రాంత ప్రజలకు, పారిశ్రామిక ప్రాంతాల్లోని అధికారులకు ఎంతగానో ఉపయోగంగా ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎయిర్‌పోర్టు విషయంలో చురుగ్గా ఉందని,పెద్దఎత్తున ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు వివరించారు.

జనవరి 28 నుంచి సమ్మక్క-సారలమ్మ జాతర

ఉమ్మడి జిల్లాలో 60కి పైగా ప్రదేశాల్లో ఏర్పాట్లు


పెద్దపల్లి జిల్లా గోయల్‌వాడలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

కరీంనగర్ కల్చరల్, జనవరి 4: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జనవరి 28 నుంచి నిర్వహించనున్న సమక్కసారలమ్మ జాతర, అధికారుల వివరాలు, శాఖాపరమైన సూచనలను ఉమ్మడి జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ నాయిని సుప్రియ విడుదల చేశారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 60కి పైగా, అందులో దేవాదాయశాఖ ఆధ్వర్యంలో 31 చోట్ల జాతర కొనసాగనుంది. ఆయా జాతరల నిర్వాహకులు, అధికారులు ఇప్పటికే ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

జాతర అధికారులు వీరే...

- కరీంనగర్ జిల్లాలో..

హుజూరాబాద్, వావిలాలకు కె.సుధాకర్, జూపాక (హుజూరాబాద్)కు కె.సుభద్ర, ఇల్లందకుంట (మల్యాల), తనుగుల (జమ్మికుంట)కు కె.మోహన్, రేకుర్తి (కొత్తపల్లి)కి ఎ.మారుతి, చింతకుంట (కొత్తపల్లి), కొండపల్కల (మానకొండూరు), కొత్తపల్లి (తిమ్మాపూర్)కు ఎన్.అనిల్‌కుమార్, కేశవపట్నం (శంకరపట్నం), సైదాపూర్‌కు డీవీ మారుతీరావు, వీణవంక, కేశవాపూర్ (జమ్మికుంట), చల్లూరు, కోరుకల్ (వీణవంక)కు జి.రాజయ్య.

- జగిత్యాల జిల్లా : ధర్మపురికి డి.కిరణ్
- పెద్దపల్లి జిల్లాలో...

కొలనూరు, మడక (ఓదెల), కొదురుపాక, తొగర్రాయి (సుల్తానాబాద్), మీర్జంపేట, పెగడపల్లి (కాల్వశ్రీరాంపూర్), హన్మంతుని పేట (పెద్దపల్లి)కి బి సదయ్య, నీరుకుళ్ళ, గర్రెపల్లి (సుల్తానాబాద్), ఎలిగేడు, తెలుకుంట్ల (జూలపల్లి)కి ఎం.శంకరయ్య , గోదావరిఖని, ఈసలతక్కళ్ళపల్లి (రామగుండం), గుండారం (కమాన్‌పూర్)కు కె.కాంతారెడ్డి, గోయల్‌వాడ (రామగుండం)కు కె.రాజ్‌కుమార్.

భక్తులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు

- నాయిని సుప్రియ, ఉమ్మడి జిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్



భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చర్యలు చేపట్టాం. అన్ని శాఖలు, జాతర కమిటీలు, అధికారుల సమన్వయంతో ముందుకు సాగాలి.

ఘనంగా దత్తాత్రేయ స్వామి జయంతి వేడుకలు



అలంకరణకు ముందు వరదవెల్లి దత్తాత్రేయ స్వామి, వ్రతంలో పాల్గొన్న భక్తులు


ధర్మపురిలో దత్తాత్రేయ స్వామి

ధర్మపురి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో దత్తాత్రేయ స్వామి జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. గత నెల 27 నుంచి ఆరంభమైన దత్తాత్రేయ స్వామి నవరాత్రోత్సవాల్లో భాగంగా గురువారం దత్తాత్రేయ స్వామి వారలను అందంగా పూలతో అలంకరణ చేశారు. అనంతరం ఆలయ వేదపండితులు విశేష పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో అనేక మంది భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ పాల్గొన్నారు. ధర్మపురి గోదావరి నదీ తీరాన గల శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయంలో దత్తాత్రేయ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

వరదవెల్లి దత్తాత్రేయ స్వామి ఆలయంలో..

బోయినపల్లి: మండలంలోని వరదవెల్లి దత్తాత్రేయ స్వామి జయంతి ఉత్సవాలు రెండో రోజు వైభవంగా జరిగాయి. స్వామివారి దర్శనం కోసం గుట్టపైకి వెళ్లేందుకు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఐదు బోట్లను ఏర్పాటు చేశారు. పౌర్ణమి సందర్భంగా వేలాదిగా భక్తులు తరలి రావడంతో స్వామివారి దర్శనం కోసం భక్తులకు మూడు గంటల సమయం పట్టింది. అనంతరం గుట్ట కింద సామూహిక సత్య దత్త వ్రతాలను నిర్వహించారు. గురుపూజ, హారతి, రాత్రి దత్తాత్రేయస్వామి డోలోత్సవం వైభవంగా నిర్వహించారు. వేములవాడ ఇన్‌చార్జి డీఎస్పీ నాగేంద్రచారి, రూరల్ శ్రీనివాస్, ఎస్సై రమాకాంత్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎయిర్‌పోర్ట్ స్థలాన్ని పరిశీలించిన అధికారులు


స్థల పరిశీలన చేస్తున్న బానోతు శ్రీనివాస్

పాలకుర్తి/అంతర్గాం డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): అంతర్గాం మండలంలో ప్రతిపాదించిన ఎయిర్‌పోర్టు స్థలాన్ని గురువారం ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు సర్వే చేశారు. కమ్యునికేషన్స్, నావిగేషన్స్, సర్వేలైన్స్ డిప్యూటీ జనరల్ మేనేజర్ బానోతు శ్రీనివాస్, ఇతర అధికారులు హాజరయ్యారు. 977 ఎకరాల స్థలంలో ఏర్పాటుకు మ్యాప్‌ను అధికారులు పరిశీలించారు. అనంతరం గోలివాడ, ముర్మూరు పంపుహౌజ్, ఎల్లంపల్లి ప్రాజెక్ట్, స్పిన్నింగ్ మిల్లు, రామగుండం రైల్వేస్టేషన్‌ను సందర్శించారు. స్థలం అనుకూలంగా ఉందని అధికారులు పేర్కొన్నారు. ఆర్డీవో గంగయ్య, తహసీల్దార్ తూము రవిందర్ పటేల్, సీఐ ప్రవీణ్ కుమార్, ట్రాన్స్‌కో, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు షీ టీం ప్రత్యేక చర్యలు



మాట్లాడుతున్న భరోసా టీం సభ్యులు

కమాన్‌పూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మహిళలు, విద్యార్థుల భద్రతకు షీటీం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని షీటీం మెంబర్ స్నేహలత తెలిపారు. గురువారం జూలపల్లి జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు షీటీంపై అవగాహన కల్పించారు. ఎవరైనా ఇబ్బందులకు గురి చేస్తే మొదట తల్లితండ్రులకు సమాచారం ఇవ్వాలని, ఆ తర్వాత తమను సంప్రదించాలన్నారు. ఆపద సమయాల్లో డయల్ 100, అలాగే 6303923700కు ఫోన్ చేయాలన్నారు. మొబైల్ ఫోన్‌ద్వారా ఆన్‌లైన్ గేమ్స్, సైబర్‌క్రైమ్‌లు పెరుగుతున్నాయని, వాటికి దూరంగా ఉండాలన్నారు. సైబర్ క్రైమ్‌కు మోసపోయిన వారు వెంటనే 1930 నెంబర్‌కు సమాచారం ఇస్తే చర్యలు చేపడుతారన్నారు. మహిళల రక్షణకు షీటీం మెంబర్లు పలు రద్దీ ప్రాంతాలు, బస్టాండ్ల వద్ద నిఘా ఉంటుందని తెలిపారు. షీ టీం సభ్యులు మౌనిక, సురేష్, ప్రధానోపాధ్యాయులు సుజాత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముత్తారం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో భరోసా టీం గురువారం బాలికల భద్రతపై అవగాహన కల్పించింది. టీం సభ్యులు ఆశ్రిత, భారతి విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై, బాల్య వివాహల నిర్మూలన, సేఫ్ యాప్‌పై వివరించారు. మహిళల రక్షణ, సోషల్ మీడియా జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయురాలు మనోలత, స్వరూప, సునీత, షాహిదా సుల్తానా, భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఘంటసాల జయంతి

మంథని, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్వర్గీయ ఘంటసాల వెంకటేశ్వర్‌రావు జయంతిని ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఆయన జయంతి పురస్కరించుకొని గాంధీచౌక్‌లో గురువారం రాత్రి ఏర్పాటు చేసిన ఘంటసాల సంగీత విభావరి శ్రోతలను అలరించింది. గాయకులు సర్వ బాపు, వనమామలై అరుణదేవి, యజ్ఞభట్ల లక్ష్మిరాజం, రావికంటి మనోహర్, మెండ రమేష్, దబ్బెట శంకర్, మలుగోజు నరేందర్, బోయ లింగన్న, మాచీడి జవహరి, ఐలి రాజేశ్వరీ, సావిత్ర, రాధికలు పాడిన పాటలు అందరిని అలరించాయి.

రాష్ట్రస్థాయి టేబుల్‌టెన్నిస్ పోటీలలో పతకాలు



రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలలో సత్తా చాటిన విద్యార్థులు

సుల్తానాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలలో సుల్తానాబాద్‌కు చెందిన ఐపీఎస్ స్కూల్ విద్యార్థులు పలు పతకాలు సాధించారు. హైదరాబాద్ మోయినాబాద్ ఫైర్ ప్యాక్స్ స్పోర్ట్స్ డిసార్లో 12వ తెలంగాణ రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు నిర్వహించారు. జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన ఐపీఎస్ స్కూల్ విద్యార్థులు ఉమెన్స్ విభాగంలో ఈ వర్షిత, ఖుషీ, శ్రీచందన, హరిణీ, కావ్య ప్రతిభను చాటారు. రాష్ట్రస్థాయిలో మూడవ స్థానంలో నిలిచి కాంస్య పతకాలు సాధించారు. గురువారం స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పతకాలు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ మాటేటి సంజీవ్‌కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియ, పీఈటీలు బొల్లి సత్యం, ఇక్బాల్, శివ, మమత అభినందించారు.

'మార్చి వరకు నేనే బార్ అసోసియేషన్ అధ్యక్షుడిని'

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తనను తొలగిస్తూ కొందరు కార్యవర్గ సభ్యులు, ప్రధాన కార్యదర్శి కలిసి చేపట్టిన అవిశ్వాస తీర్మానం చెల్లదని, తానే అధ్యక్షుడినని లకిడి భాస్కర్ పేర్కొన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా కోర్టు నూతన భవన స్థల కేటాయింపు వివాదాన్ని అడ్డు పెట్టుకుని కొందరు సీనియర్ సభ్యులు తనపై రాజకీయ కుట్ర పన్నుతున్నారన్నారు. జిల్లా కోర్టు భవనం కోసం కన్నాల వద్ద స్థలం కేటాయింపును గతంలో వ్యతిరేకించామని, పెద్దపల్లిలో స్థలం దొరకకపోవడంతోనే ప్రభుత్వం రాఘవపూర్ వద్ద స్థలం కేటాయించిందన్నారు. ఈ వివాదం కారణంగా కోర్టు భవనం కోసం మంజూరైన 81 కోట్ల రూపాయల నిధులు వెనక్కిపోయే పరిస్థితి నెలకొందన్నారు. దొంతి కిష్టయ్య, గౌరిశెట్టి సత్యనారాయణ, పుట్ట రవి, కొండ బత్తుల ఆంజనేయులు, ప్రసాద్ రావు, సొల్లురి మల్లేశం, డీవీఎస్ మూర్తి, కృష్ణరాజు, కార్తీక్, రాజేందర్, బండారి రమేష్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి మద్దతును ప్రకటించారు.

బీజేపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయండి

మంథని, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని పార్టీ క్యాడర్‌కు బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి కోరారు. పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం విడుదల చేస్తున్న నిధుల గురించి వివరించాలని కోరారు. నేతలు చల్లా నారాయణరెడ్డి, సత్యప్రకాష్, మండల పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

మంథని, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆర్థిక స్వావలంబన సాధించాలని సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ రూరల్ మేనేజర్ సాధినేని కవిరాజు అన్నారు. అమ్మ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతూ.. ఉషా శిలాయి స్కూల్ ద్వారా మహిళలకు కుట్టుశిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అమ్మ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు అంకరి కుమార్, నిర్వాహకులు అజ్మీరా షారోస్, పద్మజాలు పాల్గొన్నారు.

రామగుండాన్ని రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలబెడుతా

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రామగుండాన్ని రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలబెడుతానని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. గురువారం మున్సిపల్ టీ జంక్షన్ వద్ద కాంగ్రెస్ నాయకుడు దీటి బాలరాజు ఆధ్వర్యంలో నిర్మించతలపెట్టిన 27అడుగుల గణపతి విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ గడిచిన రెండేళ్ల కాలంలో రామగుండానికి రూ.800కోట్ల నిధులను తీసుకువచ్చి ప్రతి డివిజన్‌లో రోడ్లు, డ్రైనేజీలు, సెంట్రల్ లైటింగ్, మంచినీటి సౌకర్యంతో పాటు పాలకుర్తి, అంతర్గాం మండలంలో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులను తీసుకువచ్చానన్నారు. రామగుండం జెన్‌కో స్థానంలో 800మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. కొంత మందికి రామగుండంలో జరుగుతున్న అభివృద్ధికి వారి కంటికి కనబడడం లేదని, రూ.25కోట్లతో హనుమాన్ జంక్షన్ వద్ద ఆంజనేయ విగ్రహాన్ని ఏర్పాటు చేశామని, రాముడు నడిచిన నేల రామగుండాన్ని ఆధ్యాత్మిక క్షేత్రంగా తీర్చిదిద్దుతామన్నారు. రూ.6కోట్లతో సమ్మక్క - సారలమ్మ గద్దెల వద్ద ఆధునికీకరణ పనులు చేస్తున్నట్టు చెప్పారు. ఆర్‌జీ-1 జీఎం లలిత్ కుమార్, కాంగ్రెస్ నాయకులు బొంతల రాజేష్, మహంకాళి స్వామి, కాల్వ లింగస్వామి, గడ్డం శ్రీనివాస్, ఖాసీం, బాలరాజ్‌కుమార్, అశోక్ పాల్గొన్నారు.

విద్యా కార్యాచరణ ప్రణాళికల పై సమీక్ష

ఓదెల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): హైస్కూల్‌లో విద్యా కార్యాచరణ ప్రణాళికలపై ఎంఈఓ రమేష్ అధ్యక్షతన గురువారం సముదాయ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించారు. పాఠశాలల్లో నిర్వహించిన పరీక్ష ఫలితాలను విశ్లేషించారు. ఫిబ్రవరిలో విద్యార్థులకు నిర్వహించాల్సిన ఎఫ్ఎల్ఎస్ పరీక్షలకు సంసిద్ధులుగా తయారు చేయాలన్నారు. ప్రధానోపాధ్యాయులు పద్మ, సాంబయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల శాస్త్రీయ ఆలోచనలు భేష్



గెలుపొందిన విద్యార్థినికి బహుమతి అందిస్తున్న డీఈవో

జ్యోతినగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ జడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ గురువారంతో ముగిసింది. దీనికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా విద్యాధికారి శారద మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ ఆలోచన బేష్‌గా ఉందని, సృజనాత్మక ఆవిష్కరణలు అద్భుతంగా ఉన్నాయని అభినందించారు. జిల్లా స్థాయిలో జరిగిన మెయిన్ థీమ్‌లో వికసిత భారత్, ఆత్మ నిర్భర్ భారత్ కోసం ఏర్పాటు చేసిన బాల వైజ్ఞానిక ప్రదర్శన జరిగింది. వృక్షాలను రక్షించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తూ భాగస్వామ్యం కావాలన్నారు. మూడు రోజుల్లో విద్యార్థుల ప్రదర్శనల సబ్ థీమ్స్ సుస్థిర వ్యవసాయం, వ్యర్థాల నిర్వహణ, గ్రీన్‌ఎనర్జీ, ఎమర్జింగ్ టెక్నాలజీ, రిక్రియేషన్ మథెమటికల్ మాడలింగ్, హెల్త్, హైజీన్, నీటి సంరక్షణ తదితర అంశాలపై విద్యార్థులు 218 నమూనాలను ప్రదర్శించారు. వీటిలో సీనియర్ల విభాగంలో ఏడు, జూనియర్ల విభాగంలో ఏడు ఎంపిక చేశారు. జిల్లా స్థాయిలో ఎంపికైన విజేతలు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పలువురు అతిథులు విజేతలకు మెమొంటోలు, ప్రశంసాపత్రాలు అందించారు. విద్యార్థులకు క్విజ్ కార్యక్రమం నిర్వహించి, బహుమతులు అందజేశారు. జిల్లా సైన్సు అధికారి హనుమంతుతోపాటు రామగుండం మండల విద్యాధికారి మల్లేశం, మండలాల విద్యాధికారులు సురేంద్రకుమార్, హరిప్రసాద్, విమల, కొమురయ్య, హెచ్‌ఎంలు స్వర్ణలత, ఆగయ్య, రాంరెడ్డి, ఓదెలు, మల్లారెడ్డి, చంద్రయ్య, శ్రీనివాసచారి పాల్గొన్నారు. జిల్లా సైన్స్ అధికారి రవినందన్‌రావు నివేదిక సమర్పించగా, ముగింపు రోజు ప్రదర్శన చేసి పలు సైన్స్ ఆవిష్కరణలు, ప్రయోగాలను జడ్పీ ఉన్నత పాఠశాల నరసింహపురం, మల్యాలపల్లి, విలేజ్ రామగుండం, దుర్గయ్యపల్లి, ఎన్‌టీపీసీ స్పెక్ట్రాహైస్కూల్, 8వ కాలనీ సింగరేణి హైస్కూల్ నుంచి వచ్చాయి.

ఇన్‌స్పైర్ అవార్డుల విజేతలు:

అల్ఫోర్స్ విద్యార్థి యోగేష్ ఐఓటీ బేస్ట్ ఆటోమెటిక్ వెహికల్ ఆక్సిడెంట్ డిటెక్షన్, రెస్క్యూ సిస్టం

కమాన్‌పూర్ ఐశ్వర్య వాయిస్ గైడ్, మెడిసిన్ రిమైండర్ ఫర్ పేషెంట్, లోస్లీ పర్సన్స్

రాగినేడు వైష్ణవి, అండర్ గ్రౌండ్ ఫాల్ట్ డిటెక్టర్

దరియాపూర్ శ్రీవర్షిత్ లోకాస్ట్ మల్టీపర్పస్ ఫార్మర్ ఫ్రెండ్లీ క్యాప్

కన్నాల యూనివర్సల్ పాఠశాల, శ్రీనిత్య ఐఓటి బేస్ట్ కంట్రోల్డ్ వీల్ చైర్

పెద్దపల్లి రెసిడెన్సియల్ పాఠశాల, యాస్మిన్ అహిన్ ప్రివెంట్ రోడ్ ఆక్సిడెంట్

కన్నాల, అర్చన స్మార్ట్ అగ్రికల్చర్ సిస్టం

రాగినేడు శ్రీనిత్య లోకాస్ట్ పాడి వీడర్

పోతారం, సిరిచందన స్మార్ట్ హెల్మెట్ ఫర్ కోల్ మైనింగ్ వర్కర్స్

హరిపురంలో రైతులకు శిక్షణ

ముత్తారం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హరిపురంలో గురువారం రైతులకు శిక్షణ ఇచ్చారు. ఆర్‌ఎ ప్రాజెక్ట్ ఫీల్డ్ ఆఫీసర్ ఎస్.రాజశేఖర్ మాట్లాడుతూ పునరుజ్జీవ పంట ఉత్పత్తిపై అంశాలను వివరించారు. రైతులు కవర్ క్రాపింగ్ సంరక్షణ పద్ధతులు, వర్మీకంపోస్ట్ తయారీపై శిక్షణ ఇచ్చారు. క్రిమిసంహారక రసాయనాలు తగ్గించాలని సూచించారు. క్షేత్ర పరిశీలకులు మహేందర్, రైతులున్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

ముత్తారం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కేశనపల్లికి చెందిన శేరు విజయ మరణించగా గురువారం ఆమె కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. కూమర్, తాత బాలు నాయకులున్నారు.

జిల్లాలో వేగంగా ధాన్యం కొనుగోళ్లు..

(5వ పేజీ తరువాయి)

ఎమ్మెల్యేలు చింతకుంట విజ యరమణారావు, రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్, కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ డి వేణు, అధికారులు ఎప్పటికప్పుడు ధాన్యం కొను గోళ్లను పర్యవేక్షిస్తు న్నారు. జిల్లాలో వరి కోతలు 85 శాతానికి పైగా పూర్తయ్యాయి. ఈ నెలాఖరు వరకు పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు పూర్తి కానున్నాయి.

● సన్నాలే అధికం..

సన్న రకం ధాన్యం పంటను సాగు చేసే రైతులకు ప్రభుత్వం గత ఏడాది వానాకాలం సీజన్ నుంచి బోనస్ ఇస్తుండడంతో జిల్లాలో మెజారిటీ రైతులు సన్న రకం వరి పంటను సాగు చేశారు. క్వింటాల్ ధాన్యానికి 500 రూపాయల చొప్పున బోనస్ ఇస్తున్నారు. తమ అవసరాలకు పోనూ మిగిలిన ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయిస్తున్నారు. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యంలో సన్నరకం 2,12,559.37 మెట్రిక్ టన్నులు 87.39 శాతం ధాన్యాన్ని కొనుగోలు చేశారు. క్వింటాల్‌కు 500 రూపాయల చొప్పున 106 కోట్ల 27 లక్షల 95 వేల రూపాయల బోనస్ రైతులు పొందను న్నారు. యాసంగి సీజన్‌కు సంబంధించిన బోనస్ డబ్బులు ప్రభుత్వం విడుదల చేయకపోగా, ఈ సీజన్‌కు సంబంధించిన డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. బోనస్ వస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలి



మాట్లాడుతున్న పెద్దపల్లి డీసీపీ బి.రాంరెడ్డి

ముత్తారం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రజలు సహకరించాలని డీసీపీ రాంరెడ్డి కోరారు. ఖమ్మంపల్లి, ఓడేడు, అడవి శ్రీరాంపూర్, కేసనపల్లి గ్రామాలలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహన సదస్సులను నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డీసీపీతోపాటు గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ మాట్లాడారు. పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛాయుత వాతావరణంలో వినియోగించుకోవాలన్నారు. చట్ట వ్యతిరేకమైన, ఎన్నికల నిబంధన ఉల్లంఘన చర్యలు జరిగితే డయల్ 100, స్థానిక పోలీస్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. అభ్యర్థులు, మద్దతుదారులు శాంతి భద్రతలను కాపాడుతూ ఎన్నికల చట్టాలను గౌరవించాలన్నారు. సోషల్ మీడియా ద్వారా ఉద్రిక్తతలకు దారి తీసే పోస్టులు షేర్ చేస్తే బాధ్యులపై చర్యలు తప్పవన్నారు. గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహించవద్దని, నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మంథని సీఐ బి.రాజు, ఎస్‌ఐ ఎన్.రవికుమార్ పోలీసు సిబ్బంది, పాల్గొన్నారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు, నాయకులు సహకరించాలని డీసీపీ రాంరెడ్డి అన్నారు. మండలంలోని రత్నాపూర్, కల్వచర్ల, పన్నూరు, రాజాపూర్, బుధవారంపేట్ గ్రామాల్లో ఎన్నికల కోడ్‌పై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఏసిపి మడత రమేశ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో నల్లా బిల్లుల చెల్లింపు ప్రారంభించిన కమిషనర్



ఆన్‌లైన్ బిల్లు చెల్లించిన మహిళకు రశీదు అందజేస్తున్న కమిషనర్

కోల్‌సిటీ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్‌లో ఆన్‌లైన్‌లో నల్లా బిల్లు చెల్లింపు సౌలభ్యాన్ని గురువారం నగరపాలక సంస్థ కమిషనర్ అరుణశ్రీ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ నల్లా బిల్లును ఆన్‌లైన్‌లో చెల్లించేందుకు ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. సీడీఎంఏ వెబ్‌సైట్‌లో ఎక్కడి నుంచి నగదు రహితంగా బిల్లు చెల్లించవచ్చునని లేదా వార్డు అధికారి వద్ద ఉన్న హ్యాండ్ హెల్డ్ మిషన్ ద్వారా పన్ను చెల్లించి రశీదు పొందవచ్చునని తెలిపారు. నగరపాలక సంస్థలో 40,244 వినియోగదారులు ఉన్నారని చెప్పారు. ఆన్‌లైన్ ద్వారా మొదటి బిల్లు చెల్లించిన మహిళకు రశీదును అందజేశారు. ఈఈ రామన్, సీనియర్ అసిస్టెంట్ సాగర్, ఆర్‌ఐ శంకర్‌రావు, మౌనిక పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణకు పకడ్బందీ చర్యలు

రామగుండం కార్పొరేషన్‌లో పారిశుధ్య నిర్వహణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్టు కమిషనర్ జే అరుణశ్రీ చెప్పారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో వార్డు అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రామగుండాన్ని సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. చలి పెరుగుతున్న నేపథ్యంలో పారిశుధ్య సేవలను మొదటి షిఫ్ట ఉదయం 6గంటల నుంచి 11, రెండవ షిఫ్ట మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించనున్నట్టు చెప్పారు. రామగుండంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపించవద్దని, అధికారులు క్షేత్రస్థాయిలో పని చేయాలని, భవన నిర్మాణ అనుమతులను టౌన్ ప్లానింగ్ అధికారులు పరిశీలించాలని సూచించారు. అడిషనల్ కమిషనర్ మారుతి ప్రసాద్, ఈఈ రామన్, సెక్రటరీ ఉమా మహేశ్వర్‌రావు, అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఏసీపీ శ్రీహరి, ఆర్‌ఓ ఆంజనేయులు, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు శంకర్‌రావు, ఖాజా పాల్గొన్నారు.

రిటైర్డ్ ఐపీఎస్ అధికారి సతీమణి సర్పంచ్‌గా నామినేషన్



నామినేషన్ దాఖలు చేస్తున్న రిటైర్డ్ ఐపీఎస్ దంపతులు

సుల్తానాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలం మంచరామి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఉప్పు తిరుపతి సతీమణి లక్ష్మీ గురువారం సర్పంచ్‌గా నామినేషన్ దాఖలు చేశారు. మంచరామి సర్పంచ్ స్థానాన్ని బీసీ మహిళలకు రిజర్వ్ చేశారు. కనుకుల గ్రామ పంచాయతీ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. వారు విలేకరులతో మాట్లాడుతు ఉద్యోగ రీత్యా పలు ప్రాంతాల్లో పర్యటించానని, అక్కడి అభివృద్ధిని పరిశీలించామన్నారు. సొంత గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలనే ఆలోచనతో నామినేషన్ వేశామన్నారు. రెండు సంవత్సరాల నుంచి గ్రామంలో అనేక స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు.

దుబ్బపల్లి వద్ద చెక్‌పోస్ట్ ఏర్పాటు



వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులు

సుల్తానాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా రాజీవ్ రహదారి పై దుబ్బపల్లి వద్ద పోలీసుల చెక్ పోస్టు ఏర్పాటు చేశారు. జిల్లా సరిహద్దు గ్రామమైన దుబ్బపల్లి వద్ద ఈ చెక్ పోస్టు ఏర్పాటు చేయగా రాజీవ్ రహదారి పై వెలుతున్న కార్లు ఇతర వాహనాలను పోలీసులు తనిఖీ చేశారు. ఎన్నికల నిబంధనలు పాటించాలని, ఎక్కువ మొత్తంలో నగదు తరలించడం, ప్రలోభాలకు గురి చేసే అంశాలపై తనిఖీలు చేస్తున్నారు యాభై వేలకు మించి నగదు వ్యక్తిగతం ఉంచుకోవద్దని అంటున్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్, బీజేపీకి చెందిన పలువురు గురువారం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సమక్షంలో క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువా కప్పి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న సర్పంచులు, వార్డు సభ్యుల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే విజయం సాధిస్తారని పేర్కొన్నారు. జరుగుతున్న అభివృద్ధిని చూసే కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. సుమారు 100 మందికి పైగా కాంగ్రెస్ పార్టీలో చేరారు.

భావితరాలకు స్ఫూర్తి రోశయ్య



మాట్లాడుతున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

కోల్‌సిటీ, డిసెంబర్ 4(ఆంధ్రజ్యోతి): భావితరాలకు స్ఫూర్తి మాజీ ముఖ్య మంత్రి దివంగత రోశయ్య అని సీపీ అంబర్ కిశోర్ ఝా అన్నారు. రోశయ్య వర్ధంతి సందర్భంగా గురువారం కమి షనరేట్‌లో రోశయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా, గవర్నర్‌గా రోశయ్య నిస్వార్థ ప్రజాసేవను అందించారన్నారు. ప్రజా సంక్షేమంలో రాజకీయ నాయకులు చూపాల్సిన నైతిక విలువలు, పారదర్శకత ఆయన వ్యక్తితమని కొనియాడారు. అడిషనల్ డీసీపీ(అడ్మిన్) శ్రీనివాస్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఏఓ శ్రీనివాస్‌తో పాటు ఆర్‌ఐలు, సీపీఓలు పాల్గొన్నారు.

రోశయ్య సేవలు మరువలేనివని నగరపాలక సంస్థ కమిషనర్ అరుణశ్రీ అన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అడిషనల్ కమిషనర్ మారుతి ప్రసాద్, ఈఈ రామన్, సెక్రటరీ ఉమా మహేశ్వర్‌రావు, అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఆర్‌ఓ ఆంజనేయులు, ఏసీపీ శ్రీహరి, సూపరింటెండెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైభవంగా దత్తాత్రేయ జయంతి

మంథని, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మంథనిలో దత్తాత్రేయస్వామి జయంతిని భక్తులు గురువారం వైభవంగా నిర్వహించారు. గర్భాలయంలోని స్వామి మూలవిరాట్, ఉత్సవమూర్తులకు అర్చనలు, అభిషేకాలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి వచ్చి స్వామి వారిని దర్శించుకొన్నారు.

షిర్డి సాయిబాబా ఆలయంలో బాబాకు వైభవంగా పుష్పాభిషేకాన్ని నిర్వహించారు. భక్తులతో ఆలయంలో సందడి కొనసాగింది. అర్చకుడు రామడుగు శ్రీనివాస్, ఆలయ నిర్వాహకులు మహావాది జలజ-సత్యనారాయణ, లోకే మనోహర్, పనకంటి మురళీధర్, మారుపాక సత్యనారాయణ, తల్లం శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థి ఎంపిక

ఓదెల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ, తరగతి చదువుతున్న విద్యార్థి శ్రీరామ్ రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. ఎంఈఓ రమేష్, పీడీ రాజేందర్ మాట్లాడుతూ ఈనెల ఐదు నుంచి ఏడు వరకు మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన శ్రీరామ్‌ను అభినందించారు.



రాజస్థాన్‌లో సోలార్, థర్మల్ ప్రాజెక్టుల నిర్మాణానికి ఆమోదం

గోదావరిఖని, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థతో కలిసి రాజస్థాన్ రాజ్య విద్యుత్ ఉత్పాదన్ నిగం లిమిటెడ్ 2300మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ల (1500 మెగావాట్ల సోలార్, 800 మెగావాట్ల థర్మల్ ప్లాంట్ల) నిర్మాణానికి రాజస్థాన్ ప్రభుత్వ క్యాబినేట్ ఆమోదం తెలిపిందని రాజస్థాన్ రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి హీరాలాల్ నగర్ పేర్కొన్నారు. హైదరా బాద్ ప్రజాభవన్‌లో ఆయన ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లును గురువారం కలిసి లేఖను అందించి ఉమ్మడి విద్యుత్ ప్రాజెక్టులపై చర్చించారు. సింగరేణితో కలిసి విద్యుత్తు ఉత్పాదన ఒప్పందానికి క్యాబినెట్ అనుమతి మంజూరు చేసిందన్నారు. రెండు రాష్ట్రాల విద్యుత్ అవసరాలకు ఈ కొత్త ప్రాజెక్టులు ఎంతో దోహదపడనున్నాయని పేర్కొన్నారు. రాజస్థాన్ కాలూరామ్, ప్రమోద్ శర్మ, సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ ఈడీ చిరంజీవి, జీఎం (కో ఆర్డినేషన్) టీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్జీ-2లో సర్వే మజ్దూర్ రాత పరీక్ష

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2లో పనిచేస్తున్న జనరల్ అసిస్టెంట్ ఉద్యోగులకు సర్వే మజ్దూర్ ఎంపిక కోసం గురువారం యాజమాన్యం రాత పరీక్ష నిర్వహించింది. సెక్టార్-3 సింగరేణి పాఠశాలలో ఎస్వోటూ జీఎం రాము డు ప్రశ్నాపత్రాల సీల్ ఓపెన్ చేసి, పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. అర్హత కల్గిన 78 మంది జనరల్ అసిస్టెంట్‌లు పరీక్షకు హాజరయ్యారు. ఏరియా అధికార ప్రతినిధి అరవిందరావు, సర్వే డీజీఎం ఉజ్వల్ బందోపాధ్యాయ, ఎంవీటీసీ మేనేజర్ సురేష్‌బాబు, డీవైపీఎం వంశీధర్, ఎస్ఎస్ఓ షరీఫ్ మహమ్మద్‌లు పరీక్షల నిర్వహణ బాధ్యతలు చూశారు.

సింగరేణి ఫారెస్ట్ కాంట్రాక్టర్ల సమస్యలు పరిష్కరించాలి

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఫారెస్ట్ విభాగం కాంట్రాక్ట సమస్యలను యాజమాన్యం పరిష్కరించాలని సింగరేణి ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సుంకరి విజయ్ డిమాండ్ చేశారు. గురువారం ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫారెస్ట్ విభాగానికి మైనింగ్ విభాగం జీఎం స్థాయి అధికారికి ఇంచార్జిగా నియమించారని, అటవీ విభాగంలో అర్హత కల్గిన పూర్తిస్థాయి అధికారిని నియమించాలని కోరారు. సివిల్ విభాగం తరహాలో ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ కాంట్రాక్టు రిజిస్ట్రేషన్ చేయాలని, ఎంఎస్ఎంఈ రిజిస్ట్రేషన్ ఉన్న వారికి ఈఎండీలో మినహాయింపు ఇచ్చేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని విజయ్ డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని యాజమాన్యాన్ని కోరారు. సింగరేణి వ్యాప్తంగా సుమారు 200 మంది ఫారెస్ట్ విభాగంలో కాంట్రాక్టర్లుగా ఉన్నారని, చిన్న చిన్న టెండర్లతో జీవనోపాధి పొందుతున్న కాంట్రాక్టర్లు బిల్లులు ఆలస్యం చేస్తుండడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నట్టు తెలిపారు. కాంట్రాక్టర్లు నారాయణరెడ్డి, మహేంద్రాచారి, వీరస్వామి, రాజయ్య, కళాధర్‌రెడ్డి, శ్రీకాంత్, సంపత్, రవీందర్ పాల్గొన్నారు.

ఫారెస్ట్ కాంట్రాక్టర్ల అసోసియేషన్ నియామకం

సింగరేణి ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసినట్టు కాంట్రాక్టర్లు ప్రకటనలో పేర్కొన్నారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, అధ్యక్షుడిగా సుంకరి విజయ్‌లను ఎన్నుకున్నట్టు తెలిపారు. ఉపాధ్య క్షులుగా నారాయణరెడ్డి, రమేష్, ప్రధాన కార్యదర్శిగా సాధినేని సదానందం, కోశాధికారిగా శివకృష్ణ, ముగ్గురు చొప్పున సెక్రెటరీలు, జాయింట్ సెక్రెటరీలు, ఆర్గనైజింగ్ సెక్రెటరీలను ఎన్నుకున్నట్టు కాంట్రాక్టర్లు తెలిపారు.

జీఎం ఆఫీస్ ఎదుట నిరసన దీక్షకు తరలిరావాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాజిరెడ్డి

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సింగరేణి మెడికల్ బోర్డు తీరును నిరసిస్తూ టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ఈనెల 6న ఆర్జీ-1 జీఎం ఆఫీస్ ఎదుట చేపట్టిన నిరసన దీక్షకు కార్మికులు తరలిరావాలని యూనియన్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఆర్జీ-2 యూనియన్ ఆఫీస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టీబీజీకేఎస్ గుర్తింపు సంఘంగా ఉన్న కాలంలో 80 శాతం కార్మికులు ఇన్వాలిడేషన్ అయి, కారుణ్య నియామకాల కింద వారసులకు ఉద్యోగాలు సజావుగా ఇచ్చే విధంగా మెడికల్ బోర్డు జరిగినట్టు తెలిపారు. గడిచిన రెండేళ్లలో ఆరుసార్లు మాత్రమే మెడికల్ బోర్డు నిర్వహించారని, దానిలో ఒక దఫా మెడికల్ బోర్డు రిఫరల్ హైయర్ సెంటర్ వారికి ఎనిమిది నెలల పాటు అన్‌ఫిట్‌లో ఉంచి 55 మందిలో కేవలం ఐదుగురిని మాత్రమే అన్‌ఫిట్ చేశారని తెలిపారు. ప్రస్తుతం మెడికల్ బోర్డు తీరుతో కారుణ్య నియామకాలపై కార్మికుల్లో ఆందోళన నెలకొన్నట్టు తెలిపారు. ఆర్జీ-2,3 వైస్ ప్రెసిడెంట్లు అయిలి శ్రీనివాస్, నాగెల్లి సాంబయ్య, నాయకులు అబ్బు శ్రీనివాస్‌రెడ్డి, రవితేజ, దాసరి శ్రీనివాస్, వెంకటేష్, రమేష్, కమలాకర్, నరేష్, నారాయణరెడ్డి, అశోక్, దినేష్, తిరుమలై, సాయిరాం పాల్గొన్నారు.

సంకల్ప బలం ముందు అంగవైకల్యం అడ్డురాదు

రామగిరి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సంకల్ప బలం ముందు అంగవైకల్యం అడ్డురాదు ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు అన్నారు. సింగరేణి సంస్థ ఆర్జీ-3,ఏపిఏ డివిజన్‌ల పరిధిలో ఆడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా వర్క్ పిపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఆధ్వర్యంలో గురువారం సిఈఆర్ క్లబ్‌లో దివ్యాంగులకు క్రీడలను ఏర్పాటు చేశారు. జీఎంలు సుధాకర్‌రావు, నాగేశ్వర్‌రావులు సంయుక్తంగా ప్రారంభించారు. పోటీల్లో గెలుపొంది విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు రాంచందర్‌రెడ్డి, రామారావు, అధికారులు కొలశ్రీనివాస్‌రావు, సుదర్శనం, రాజేశం, మనో చైతన్య సంస్థ ఇంచార్జ్ కృష్ణకుమార్ పాల్గొన్నారు.